PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 60 | విజయవాడ, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, monday 30 September 2024 | Rs

కష్టాల్లో లేయర్ కోళ్ల పరిశ్రమ

- బేజారెత్తిస్తున్న మేత ధరలు
- పెంపకంపై తీవ్ర ప్రభావం

3




వరల్డ్ జూనియర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు స్వర్ణం

6

టార్గెట్

- పెస్టిసైడ్స్ వ్యతిరేక గళాలపై నిఘా
- అమెరికా కేంద్రంగా వి-ఫ్లూయెన్స్ సంస్థ నిర్వాకం
- అక్కడి ప్రభుత్వం నుంచి నిధులు
- భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా సమాచార సేకరణ
- ఆ జాబితాలో సామాజిక, శాస్త్ర, పర్యావరణ, విద్యావేత్తలు
- 'లైట్‌హౌజ్ రిపోర్ట్స్' కథనం

న్యూఢిల్లీ : పెస్టిసైడ్స్ (పురుగుమందులు)కు వ్యతిరేకంగా గళమెత్తారో...మీ ఫోటో, పేరు, చిరునామా సహా సమస్త సమాచారం అమెరికాకు చేరిపోతుంది. అక్కడి నుంచే మిమ్మల్ని ఎలా నిలువరించాలి...ఎలా నిర్బంధించాలనే వ్యూహరచన కూడా సాగిపోతుంది. ప్రపంచవ్యాప్తంగా పెస్టిసైడ్స్, జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా గళమెత్తేవారందరి సమస్త సమాచారాన్ని రాబట్టేందుకు అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న పీఆర్ సంస్థ వి-ఫ్లూయెన్స్ ఈ నిఘా సమాచారాన్ని చేరవేస్తుంది. ఈ విషయాన్ని లైట్‌హౌజ్ రిపోర్ట్స్ బట్టబయలు చేసింది. ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడిన భారత్ వంటి దేశాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది. ప్రజల ఆరోగ్యాలను ప్రభావితం చేసే పెస్టిసైడ్స్, జన్యుమార్పిడి పంటలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించటం ఈ కంపెనీలకు వరంగా మారింది. అలాంటి కంపెనీలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక మంది శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు పోరాడుతున్నారు. రైతులు, ప్రజల తరపున తమ గళాన్ని వినిపిస్తున్నారు. అయితే వారిని అణచివేసే చర్యలు అనేక రూపాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పుడు అమెరికా కేంద్రంగా మిస్సోరీకి చెందిన వి-ఫ్లూయెన్స్ ఇంటరాక్టివ్ సంస్థ ఈ అణచివేత చర్యల్లో పరోక్ష భాగస్వామిగా ఉందని లైట్‌హౌజ్ రిపోర్ట్స్ తెలిపింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. 'లైట్‌హౌజ్ రిపోర్ట్స్' వార్త సంస్థ కథనం ప్రకారం వి-ఫ్లూయెన్స్‌కు గతంలో అమెరికా ప్రభుత్వం నుంచి నిధులు అందాయి. యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యుఎస్ ఎయిడ్)లో గతంలో కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేసిన జే బైర్నె వి-ఫ్యూయెన్స్‌ను 2001లో స్థాపించి నడుపుతున్నారు. ఈ సంస్థ ప్రపంచ ఆగ్రోకెమికల్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీకి సమాచార సేకరణ, నిఘా పెట్టటం, ప్రొప్రైటరీ డేటా మైనింగ్, సమాచార విశ్లేషణలు చేయటం వంటి సేవలను అందిస్తుంది. భారత్‌లోని ప్రముఖ పర్యావరణవేత్త వందన శివ, జీవావరణ శాస్త్రవేత్త దేబాద్ దేబ్, ఇతర కీలక సైంటిస్టులు, విద్యావేత్తలతో పాటు ప్రపంచవ్యాప్తంగా 500 మందికి పైగా సమాచారాన్ని వి-ఫ్యూయెన్స్ రూపొందించిన ఒక ప్రయివేటు సోషల్ నెట్‌వర్క్ కలిగి ఉన్నది. ఇందులో ఆగ్రోకెమికల్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీకి చెందిన ఉద్యోగులు, భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా దాని అనుబంధ రంగాలు భాగమై ఉంటాయి.



అయితే, వి-ఫ్లూయెన్స్ చర్యలపై ప్రపంచవ్యాప్తంగా పెస్టిసైడ్‌లకు వ్యతిరేకంగా గళం వినిపించే ప్రముఖ వ్యక్తులలో ఆందోళన నెలకొంది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి. ఆ సంస్థ సేకరించిన సమాచారం ఎలా వాడుకుంటుంది? ఎవరికిస్తుంది? గోప్యతను ప్రమాదంలో పడేస్తుందా? అన్న అనుమానాలు, భయాలు సర్వత్రా మిగతా 5లో

సిపిఎం సమన్వయకర్తగా ప్రకాశ్ కరత్

- కేంద్ర కమిటీ ప్రకటన
- సీతారాం ఏచూరి, బుద్ధదేవ్, ఆర్ఎస్‌తో సహా అమరవీరులకు సంతాపం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం సమన్వయకర్తగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ వ్యవహరించనున్నారు. ఢిల్లీలో రెండు రోజులపాటు జరిగిన ఆ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో మదురైలో జరిగే పార్టీ 24వ అఖిలభారత మహాసభ వరకు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలను సమన్వయపరిచే బాధ్యత ఆయన నిర్వహిస్తారు. ప్రస్తుత సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆకస్మికంగా కనుమూసినందున ఈ ఏర్పాటు అవసరమైంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి , పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎం లారెన్స్, సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు ఆర్ సత్యనారాయణరాజు (ఆర్ఎస్) తదితరుల మృతికి సంతాపం తెలుపుతూ కేంద్ర కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై కేంద్ర కమిటీ చర్చించింది. ఈ సమావేశంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, బివి రాఘవులు, సూర్యకాంత్ మిశ్రా, సుభాషిణి అలీ, ఎమ్‌డి సలీం, ఎంఎ బేబి, తపన్ సేన్, జి రామకృష్ణ, ఎ విజయరాఘవన్, నిలోత్పల్ బసు, అశోక్ ధావలే, రామచంద్రడోమ్, గోవిందన్ మాస్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, హేమలత, పుణ్యవతి, జి నాగయ్య, సిహెచ్ సీతారాములు, బి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాష్టీకంపై అంతర్జాతీయ సమాజం ఆగ్రహం

- దురాక్రమణ పూరిత దాడులు ఆపాలని డిమాండ్
- దాడులు కొనసాగుతాయంటూ హూంకరిస్తున్న నెతన్యాహు

బీరుట్: లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా నేతల హత్యలను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల తదనంతర పర్యవసానాలకు ఇజ్రాయిల్, దానికి అండదండలిస్తున్న అమెరికా కాపూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించాయి. పశ్చిమాసియాను అస్థిరపరిచే యూదు దురహంకార ఇజ్రాయిల్ దాడులను తక్షణమే ఆపాలని అవి డిమాండ్ చేశాయి. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య జరిగి 24 గంటలు కూడా తిరక్క ముందే మరో హిజ్బుల్లా నేత నబిల్ కౌక్‌ను ఇజ్రాయిల్ సైన్యం దుర్మార్గంగా హత్య చేసింది. హిజ్బుల్లా నాయకత్వాన్ని తుడిచిపెట్టడంలోతాము విజయం సాధించామని, అయినా దాడులు కొనసాగుతాయని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికగా యుద్ధోన్మాది ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు హూంకరించాడు. తాజాగా సిరియాపై దాడికి దిగాడు. దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు అమెరికా మద్దతుతో నెతన్యాహు ప్రయత్నిస్తున్నాడు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దురాక్రమణపూరిత దాడులు, హిజ్బుల్లా చీఫ్ హత్యను అరబ్బు దేశాలతో బాటు చైనా, రష్యా, క్యూబా, వెనిజులా, అర్జెంటీనా, కొలంబియా, దక్షిణాఫ్రికా తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా మాత్రం ఇది ఉగ్రవాదుల చేతిలో బలైన వేలాది మంది అమాయక పౌరులకు చేకూరిన న్యాయం అని అభివర్ణించింది. అమెరికా మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు సైతం మిగతా 5లో

నేపాల్‌లో వరద బీభత్సం

- 148 మంది మృతి
- దెబ్బతిన్న పలు జల విద్యుత్ ప్రాజెక్టులు

5



విభిన్న కోణాల్లో దర్యాప్తు

- లడ్డూ కేసు ప్రాథమిక దశలోనే : 'సిట్' చీఫ్ త్రిపాఠి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వాడినట్లు అందిన ఫిర్యాదుపై విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇతర అంశాలనూ పరిశీలిస్తున్నామని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చీఫ్ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు. ఈ బృందం ఆదివారం కూడా దర్యాప్తు కొనసాగించింది. పద్మావతి అతిథి గృహంలో టిటిడి ఇఒ శ్యామలరావుతో సమావేశమైంది. అనంతరం మీడియాతో త్రిపాఠి మాట్లాడారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా విచారణ ప్రారంభించామని, ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని తెలిపారు. నెయ్యి సరఫరా చేసిన తమిళనాడులోని ఎఆర్ డెయిరీపై ప్రధానంగా ఫిర్యాదు అందిందని, దీనిపై సిట్ విచారణ చేస్తోందని చెప్పారు. విచారణకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రికార్డుల స్వాధీనం, పరిశీలన

శ్రీవారి లడ్డూ కోసం వాడే నెయ్యి, యాలకులు, కలకండ, చక్కెరతోపాటు నైవేద్యానికి వాడే నూనె, ఇతర సరుకుల కొనుగోలు రికార్డులను టిటిడి మార్కెట్ విభాగం నుంచి సిట్ బృందం స్వాధీనం చేసుకుంది. వీటిని తిరుపతిలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఒక బృందం పరిశీలిస్తోంది. గత ఐదేళ్లలోనూ, అంతకు ముందు ఐదేళ్లలోనూ టిటిడికి ఎంత నెయ్యి వచ్చింది? ఎన్ని రకాల సరుకులు వచ్చాయి? వాటి నాణ్యతపై ఆరా తీస్తోంది. టిటిడికి నెయ్యి సరఫరా చేసిన చెన్నయ్‌లోని ఎఆర్ డెయిరీకి మరో బృందం వెళ్లి విచారణ చేస్తోంది. మూడో బృందం సోమవారం ఉదయం తిరుమలలోని లడ్డూపోటు, అన్నదానం తయారీ విభాగం, లడ్డూ విక్రయశాలలను పరిశీలించనుంది.



మీడియాతో మాట్లాడుతున్న సిట్ చీఫ్ త్రిపాఠి

దీనికన్నా వేరే సాక్ష్యం కావాలా..?

- లడ్డూ వివాదంపై జగన్ ట్వీట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సత్యమేవ జయతే అంటూ వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ట్వీట్ చేశారు. లడ్డూ ప్రసాదంపై మాట మార్చిన ఇఒ, సిఎం చంద్రబాబుపై ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ వీడియోలు పోస్టు చేశారు. దీని అర్థం ఏమిటి చంద్రబాబు.. దీని కన్నా వేరే సాక్ష్యం కావాలా..? అంటూ వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సెప్టెంబరు 18న సిఎం చంద్రబాబు తిరుమల లడ్డూలో యానిమల్ ఫ్యాట్ కలిసిందంటూ ఒకసారి, యాత్రికులకు పెట్టే ప్రసాదం అపవిత్రం చేసే విధంగా ఉంది, ఓసారి బాధేస్తుంది నాసిరకమైన ఇంగ్రిడియంట్స్ కాకుండా యానిమల్ ఫ్యాట్ కూడా వాడారని, తిరుమలకు నాలుగు నెయ్యి ట్యాంకర్లు వచ్చాయని, దానిని వాడారని చంద్రబాబు మళ్లీ అబద్ధాలను నిజం చేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు.. ఆ ట్యాంకర్లను వాడలేదని, వెనక్కి పంపామని చెబితే, ఏకంగా ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న చంద్రబాబు.. ఆ నెయ్యి వాడారంటూ అసత్య ప్రచారానికి దిగారని జగన్ తెలిపారు.

రాజ్యసభ రేసులో పలువురు

- టిడిపికి రెండు, ఒకటి జనసేనకు?
- పోటీలో నాగబాబు



యనమల



గజపతిరాజు



నాగబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రాజ్యసభ సీట్లను పలువురు టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నేతలు ఆశిస్తున్నారు. వైసిపి నుంచి ఎంపికైన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. రాజ్యసభ ఛైర్మన్ కూడా ఈ రాజీనామాను ఆమోదించారు. త్వరలో ఈ మూడు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. శాసనసభలో కూటమి ప్రభుత్వం నుంచి 164 మంది, వైసిపి నుంచి 11 మంది ఉన్నారు. దీంతో ఈ మూడు సీట్లలో కూటమినే గెలుస్తోంది. రాజ్యసభలో ప్రస్తుతం టిడిపికి ప్రాతినిధ్యం లేదు. ఆ పార్టీ స్థాపించినప్పటీ నుంచి ఈ పరిస్థితి ఎప్పుడూ లేదు. కనకమేడల రవీంద్ర కుమార్ పదవీ కాలం ముగియడంతో గత ఏప్రిల్‌లో టిడిపి రాజ్యసభలో తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయింది. ఇప్పుడు రాజీనామాలతో మరోసారి రాజ్యసభలో ప్రాతినిధ్యం చేసే అవకాశం టిడిపికి వచ్చింది. జనసేన పార్టీ పదేళ్ల ప్రస్థానంలో ఇప్పటి వరకు రాజ్యసభలో స్థానం పొందలేదు. తొలిసారిగా జనసేన కూడా రాజ్యసభలోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఖాళీ అయిన మూడు సీట్లలో రెండు టిడిపికి, ఒకటి జనసేనకు కేటాయించేలా మూడు పార్టీల మధ్యం ఒప్పందం జరుగుతున్నట్లు తెలుస్తోంది. మిత్రపక్షమైన బిజెపికి దక్కే అవకాశం లేదు. బీద మస్తాన్‌రావు త్వరలో టిడిపిలో చేరుతారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాజీనామా మిగతా 5లో

రేపు పుచ్చకాయలమాడకు ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, పుచ్చకాయలమాడకు అక్టోబరు ఒకటిన సిఎం చంద్రబాబు వెళ్లనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 1:45 గంటలకు కాశీవిశ్వేశ్వర దేవస్థానం సందర్శన, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ పంపిణీ కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. ఒకటిన ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి 11:35 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి 12:40 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం స్థానిక నేతలతో కొద్దిసేపు మాట్లాడుతారు. అక్కడ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

టిటిడి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు?

- నేడు నామినేటెడ్ పోస్టుల రెండో జాబితా!

2

నిరుద్యోగంపై అవాస్తవాలు

- ఇపిఎఫ్ఓపై కేంద్రం వాదనలో హేతుబద్ధత కరువు
- తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వ ప్రకటనలు

5



కొత్తమంత్రులతో గవర్నర్, సిఎం

తమిళనాడు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

- సెంథిల్‌బాలాజీ, మరో ముగ్గురు మంత్రుల ప్రమాణం
- ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించారు. మూడు రోజుల క్రితం పుఝల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన డిఎంకె శాసనసభ్యుడు వి.సెంథిల్‌బాలాజీ ఆదివారం తమిళనాడు విద్యుత్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. డిఎంకె శాసనసభ్యులు ఆర్.రాజేంద్రన్, గోవి. చెజియాన్, ఎస్ఎం నాజర్ కూడా కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. సెంథిల్‌బాలాజీ, నాజర్ గతంలోనూ మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. చెన్నైలోని రాజ్‌భవన్‌లో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, మిగతా 5లో

పెట్టుబడిదారుల కోసం కన్సల్టేటివ్ ఫోరం

- ఛైర్మన్‌గా మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సిఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటైంది. ఫోరం ఛైర్మన్‌గా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైస్ ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనున్నారు. ఇందుకు సంబంధించిన జిఓ 58ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితితో ఈ ఫోరం పనిచేయనుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించనుంది. ఈ కమిటీలో సభ్యులుగా మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఇంధన, ఆర్థిక, రోడ్లు, భవనాలు, జలవనరులశాఖ, పరిశ్రమలు-వాణిజ్య, జిఎడి, పర్యాటక, ఐటి-ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ శాఖల ముఖ్యకార్యదర్శులు ఉంటారు. వీరితోపాటు ఎపి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సిఇఒ, భారత పరిశ్రమల సమాఖ్య ఎపి కౌన్సిల్ ఛైర్మన్ మెంబర్ కన్వీనర్‌గా, వైస్ ఛైర్మన్, కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

మా పొట్ట కొట్టాలని చూస్తే ఖబడ్దార్

- కూర్మన్నపాలెం నుంచి పెదగంట్యాడ వరకూ ఉక్కు కాంట్రాక్టు కార్మికుల మహా పాదయాత్ర
- ఐక్య ఉద్యమాలతో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం : సిహెచ్.నర్సింగరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడపాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిర్ణయాన్ని పూర్తిగా విరమించుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ప్లాంట్‌కు కావాల్సిన ముడి సరుకు, నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఉక్కు కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు పరిరక్షణ దీక్షా శిబిరం నుంచి వడ్లపూడి, పాత గాజువాక, పెదగంట్యాడ నెల్లిముక్కు స్టేజీ వరకూ ఈ పాదయాత్ర ఉత్తేజంగా సాగింది. తొలుత ఈ మహా పాదయాత్రను సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. తమ ఉపాధి జోలికొస్తే ఖబడ్దార్ అంటూ పాదయాత్రలో పాల్గొన్నవారంతా హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని పెద్ద పెట్టున నినదించారు. పాదయాత్ర అనంతరం నెల్లిముక్కులో జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు ఉక్కు పరిరక్షణ పోరాటంలోకి ఉవ్వెత్తున కదిలిరావాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికొస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని, ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరమైతే నిర్వాసితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పాత పోరాటాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లలో నిర్వాసితులకు ఉపాధి దక్కిందని, మిగతా 5లో

టిటిడి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు?

- నేడు నామినేటెడ్ పోస్టుల రెండో జాబితా!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు ఛైర్మన్‌గా బొలినేని రాజగోపాల్ నాయుడు పేరు ఖరారైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన టివి-5 ఛానెల్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. సోమవారం నామినేటెడ్ పదవుల రెండు జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ జాబితాలో టిటిడి బోర్డు ఛైర్మన్, సభ్యుల పేర్లు కూడా విడుదల కానున్నాయి. మొత్తం 15 మంది సభ్యులతో బోర్డు ఉంటుందని తెలిసింది. సభ్యులుగా టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఇద్దరు, మాజీ ఎమ్మెల్యేలు ఇద్దరు ఉండే అవకాశం ఉంది. జనసేన, బిజెపి నుంచి చేరొక సిట్టింగ్ ఎమ్మెల్యేను నియమించవచ్చని తెలిసింది. నామినేటెడ్ పోస్టుల భర్తీని దసరాలోపు దశలవారీ భర్తీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ భావిస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులపై టిడిపి కసరత్తు

- ఆలపాటి, వర్మ పేర్లు పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న శాసనమండలి పట్టభద్ర నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై టిడిపి కసరత్తు చేస్తోంది. కృష్ణా-గుంటూరు నియోజకవర్గ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, తూర్పు-పశ్చిమ గోదావరి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పదవీ కాలాలు మార్చితో ముగుస్తున్నాయి. దీంతో ఈ స్థానాల్లో తన అభ్యర్థులను టిడిపి పోటీలో ఉంచేందుకు సిద్ధమైంది. కృష్ణా-గుంటూరు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తూర్పు-పశ్చిమ గోదావరి నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ పేరు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా వీరిద్దరికీ ఎమ్మెల్యే టికెట్లు కేటాయించలేదు. దీంతో వీరిని ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

శ్రీవారిమెట్టు వద్ద చిరుత కలకలం

- భయాందోళనలో సందర్శకులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు వద్ద చిరుత పులి కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో చిరుత రావడంతో కుక్కలు అరుస్తూ వెంబడించాయి. చిరుతపులి వాటిపై దాడి చేయడానికి పరుగెత్తడంతో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు దీపక్ అప్రమత్తమయ్యి కంట్రోల్ రూమ్‌లోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. టిటిడి సెక్యూరిటీ, అటవీ శాఖ అధికారులకు సెక్యూరిటీ గార్డు శనివారం ఉదయం చిరుత గురించి సమాచారమిచ్చారు. పెరటాసి మాసం కావడంతో శ్రీవారి మెట్టు మార్గాన వివిధ రాష్ట్రాల నుంచి కాలినడకన సందర్శకులు తిరుమలకు చేరుకుంటున్నారు. ఈ దశలో ఏ టైంలో ఏం జరుగుతుందోనని అధికారులు ఆందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుమలకు వెళ్లాలని సందర్శకులకు వారు సూచిస్తున్నారు. పులి భయం తొలిగేటట్లు టిటిడి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని సందర్శకులు కోరుతున్నారు.

విజయవాడలో విషాదం

- ఇద్దరు చిన్నారులతో కలిసి కాలువలో దూకిన తల్లి
- నాలుగు నెలల చిన్నారి మృతి

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన రెండేళ్ల పాప, నాలుగు నెలల చిన్నారితో కలిసి బందరు కాలువలోకి దూకింది. ఈ సంఘటన రామలింగేశ్వర్‌నగర్ స్క్రూబ్రిడ్జి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నాలుగు నెలల పసికందు మృతి చెందగా తల్లి, మరో పాప గల్లంతయ్యారు. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు శారదా నగర్‌కు చెందిన సుధారాణి, ఆమె భర్త తిరుపతిరావు మధ్య తరుచూ కుటుంబ కలహాలు జరుగుతుండేవి. శనివారం రాత్రి కూడా భర్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో విజయవాడ కృష్ణలంకలోని కళానగర్ రెండో లైనులో నివాసముంటున్న తిరుపతిరావు అన్నయ్య కోటేశ్వరరావు ఇంటికి పిల్లలతో కలిసి భార్యాభర్తలు ఆదివారం ఉదయం వచ్చారు. మధ్యాహ్నం వరకు అందరూ ఇంటి వద్దనే ఉన్నారు. సుధారాణి తన ఇద్దరు పిల్లలతో కలిసి స్క్రూబ్రిడ్జి పైనుంచి కాలువలో దూకింది. కాలువ ప్రవాహం ఉధృతంగా ఉండటంతో తల్లితోపాటు పెద్ద పాప గల్లంతు కాగా, చిన్నారి మృతదేహం బయటపడింది. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు వాయిదా వేశారు. తిరుపతిరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పటమట సిఐ పవన్‌కిషోర్ తెలిపారు.

క్లిష్ట పరిస్థితుల్లో దేశం పెద్ద దిక్కును కోల్పోయింది

- సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఎంఎ గఫూర్



సభలో మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి లేని లోటు దేశానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిదని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్ అన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పెద్ద దిక్కును దేశం కోల్పోయిందన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో గఫూర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత సీతారాం చిత్రపటానికి గఫూర్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు.

అనంతరం జరిగిన సభలో గఫూర్ మాట్లాడుతూ.. కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పోరాడిన సీతారాం రాజ్యసభకు రెండుసార్లు ఎన్నికయ్యారని, సభలో ఆయన సలహాలు, సూచనలు అధికార, ప్రతిపక్ష సభ్యులు హుందాగా స్వీకరించేవారని తెలిపారు. యుపిఎ-1 హయాంలో ఉత్తమ చట్టాలు రావడానికి కృషి చేసిన ఆయన ఉత్తమ పార్లమెంటేరియన్‌గానూ ఎన్నియ్యారని చెప్పారు. ఇన్ని బాధ్యతలు నిర్వహిస్తూనే అనేక పుస్తకాలు రాశారని గుర్తు చేశారు. ఇండియా వేదిక ఏర్పాటులో సీతారాం పాత్రం కీలకమన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు పార్టీ సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు సీతారాం ఏచూరి తన సహకారాన్ని అందించారని తెలిపారు. సోషలిజం కోసం జీవితాంతం కృషి చేసిన సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఆదే బాటలో కొనసాగుదామని కోరారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి గొప్ప రాజనీతజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. రాజకీయ నాయకులు రాబోయే ఎన్నికల గురించి ఆలోచిస్తే రాజనీతిజ్ఞులు రాబోయే తరాల గురించి ఆలోచిస్తారని తెలిపారు. సీతారాం ఏచూరి ఇదే కోవకు చెందిన నేతని అన్నారు. 1990 నుంచి 2024 వరకు దేశ రాజకీయాల్లో ముఖ్య పాత్ర పోషించారని, ఆర్థిక దుష్ఫలితాలను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అనంతరం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ఇతర నాయకులు మాట్లాడారు.



మాట్లాడుతున్న మంత్రి స్వామి

గిరిజనుల సంక్షేమానికి కృషి

- వచ్చే ఏడాది ట్రైకార్ రుణాల పునరుద్ధరణ
- మంత్రి బాలవీరాంజనేయస్వామి
- ఘనంగా గిరిజన ఉద్యోగ సంఘం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఆదివారం జరిగాయి. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం ఒకటో తేదీన ఉద్యోగులందరికీ జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. ట్రైకార్ రుణాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పునరుద్ధరిస్తామన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్థనరావు మాట్లాడుతూ గిరిజనుల శ్రేయస్సు, అభ్యున్నతి కోసం పని చేసిన మహనీయులను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో వేట ప్రధాన వృత్తిగా సాగిస్తున్న యానాదులకు గుర్తింపు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ నాయక్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లంక గ్రామాల వరద బాధిత స్కీమ్ వర్కర్లకు చేయూత

- సిఐటియు ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న కార్మికులకు, స్కీమ్ ఉద్యోగులకు సిఐటియు చేయూతనందించింది. వరదల్లో దెబ్బతిన్న లంక గ్రామాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం పథకం, యానిమేటర్స్, పంచాయతీ కార్మికులు సుమారు 200 మందికి సిఐటియు రాష్ట్ర కమిటీ రూ.800 విలువ చేసే నిత్యావసర వస్తువుల కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల్లో వివిధ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులతో పాటు అసంఘటిత రంగంలోని భవన నిర్మాణం, ముఠా కార్మికులు వరదలతో సర్వం కోల్పోయారన్నారు. బాధ్యత కలిగిన సిఐటియు కార్మికులకు అన్ని సందర్భాల్లో అండగా ఉంటుందని, ఈ నేపథ్యంలోనే 200 కార్మిక కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిత్యం పోరాటంలో ముందుండే సిఐటియు వరదల్లో అనేక మందికి అన్నదానాలు, కిట్ల పంపిణీని చేపట్టిందని తెలిపారు. కృష్ణా నది లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 108 మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం నాయకులు గీత, సిఐటియు నాయకులు సిహెచ్ మజుందార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె ఝాన్సీ, ఆశావర్కర్ల సంఘం నాయకులు వెంకటేశ్వరమ్మ, ప్రజా సంఘాల నాయకులు టి కృష్ణమోహన్, బి అగస్టీన్, టి సురేష్, జి సుధాకర్, బి సుబ్బారావు, పి నాగమల్లేశ్వరరావు, కృపానందం, దివ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రాప్ కెమెరాలో చిరుత కదలికలు

చిక్కని చిరుత

- 23 రోజులుగా ముప్పతిప్పలు
- తాజాగా బుర్రిలంకలో అడుగుజాడలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలో చిరుత కలకలం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. 23 రోజుల క్రితం దివాన్ చెరువు అటవీ ప్రాంతంలోని దూరదర్శన్ కేంద్రం కార్యాలయ ఆవరణలో దీని అడుగుజాడలను తొలిసారిగా అధికారులు గుర్తించారు. తాజాగా ఈ చిరుత కడియం మండలం బుర్రిలంకలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు ఇటీవల ధ్రువీకరించారు. అప్పటి నుంచి చిరుత కోసం గాలిస్తూ ఉన్నా అది చిక్కడం లేదు. జిల్లాలో సంచరిస్తున్న చిరుత సమీపంలో ఉన్న మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చిందని అధికారులు అభిప్రాయపడ్డారు. కానీ, నేటికీ దీన్ని ధ్రువీకరించలేదు. ఒక్కటే వచ్చిందా? లేక జంటగా వచ్చిందా? అనే అనుమానం కూడా వ్యక్తమైంది. ఒక్క చిరుతే వచ్చినట్టు 15 రోజుల తర్వాత నిర్ధారణకు వచ్చారు. కడియం మండలం బుర్రిలంక శివారులోని లంక ప్రాంతాల్లో జింకలు ఉన్నందున అటువైపు వెళ్లేందుకు ఎక్కువ అవకాశం ఉందని భావిస్తున్నారు.

అధికారుల ప్రయత్నాలు విఫలం

చిరుతను బంధించేందుకు అటవీ శాఖాధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నాయి. దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్టులో 70 ట్రాప్ కెమెరాలను అమర్చి చిరుత కదలికలను పరిశీలిస్తూ వచ్చారు. దాన్ని బంధించేందుకు ఏడు బోన్లను అమర్చారు. తాజాగా చిరుత దిశ మార్చడంతో కడియంలో 20 ట్రాప్ కెమెరాలను, ఐదు సోలార్ బేస్డ్ సిసి కెమెరాలను, రెండు బోనులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఐదు బృందాలు గాలిస్తున్నాయి. 60 మంది అటవీ సిబ్బంది డ్రోన్లతోనూ జల్లెడ పడుతున్నారు. ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. అధికారుల ప్రణాళికలకు అనుగుణంగా బోనులోకి వెళ్తేసరే, లేకుంటే మేకపై దాడి చేస్తే తగు జాగ్రత్తలు తీసుకుని మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు కూడా సిద్ధపడినా చిరుత జాడ లేక అయోమయంలో పడ్డారు.

ప్రజల్లో ఆందోళన

జిల్లాలో చిరుత సంచారంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. వర్షాకాలంలో మొక్కల ఎగుమతులు, దిగుమతులు అధికంగా జరుగుతుంటాయి. నర్సరీల మధ్యగా చిరుత సంచారం నేపథ్యంలో కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉన్న నర్సరీల్లో 30 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. నర్సరీలను అనుకునే జనావాసాలు ఉండడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం చిరుత సంచారంతో కొంతమంది కార్మికులు పనులకు కూడా వెళ్లడం లేదు.

అసత్య ప్రసారాలు చేస్తే చర్యలు

గోదావరి లంకల్లో అటవీ శాఖ బృందాలు అన్వేషణ సాగిస్తున్నాయి. కడియం నర్సరీల్లో పనిచేసే వారికి, చుట్టుపక్కల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అసత్య ప్రచారాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు.

- ఎస్ భరణి, జిల్లా అటవీ శాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

ఇపిఎస్ హయ్యర్ పెన్షన్ సమస్యలు పరిష్కరించాలి

- హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు ఆర్‌టిసి ఉద్యోగులు తరలిరండి: ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇపిఎస్ హయ్యర్ పెన్షన్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ బర్కత్‌పురాలోని ఇపిఎఫ్ఒ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయం ముందు అక్టోబరు 7న జరిగే మహా ధర్నా కార్యక్రమంలో ఆర్‌టిసి ఉద్యోగులంతా పెద్దయెత్తున పాల్గొనాలని కోరింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు జాతీయ కార్యదర్శి, ఇపిఎఫ్ఒ సిబిటి సభ్యులు కరుమలయన్ పాల్గొంటారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండేళ్లు అవుతున్నా.. నేటికీ హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికులు ఉద్యోగుల సమస్యలను చెప్పుకునేందుకు కనీసం గ్రీవెన్స్ సెల్ సదుపాయం కూడా అందుబాటులో లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి
ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్‌ను కోరిన ఇయు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. గత ప్రభుత్వం రద్దు చేసిన పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించి గత ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ నెంబర్ 01/2019ను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆదివారం ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య తదితరులు ఆర్‌టిసి ఛైర్మన్‌గా ప్రకటించబడిన కొనకళ్ల నారాయణను కలిశారు. ఈ సందర్భంగా కొనకళ్లను ఇయు రాష్ట్ర కమిటీ సత్కరించి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో ఇయు నాయకులు జి నారాయణరావు, పి భానుమూర్తి, మందపాటి శంకరరావు, వై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిపిసిఎల్ లైన్ నిర్మాణ పనులు అడ్డగింత

- రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి-సంతనూతలపాడు (ప్రకాశం జిల్లా)

రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పైపులైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో బిపిసిఎల్ పైపు పనులను రైతులు అడ్డుకున్నారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ పనులను నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ సెంటుకు రూ.25 వేల వంతున రైతులకు నష్ట పరిహారం చెల్లించి పైపు లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిపిసిఎల్ పైపులైనుకు 16 మీటర్ల వెడల్పుతో భూమి అవసరం ఉన్న విషయాన్ని రైతులకు చెప్పడంలేదని పైపులైను వేసుకున్న తర్వాత ఎప్పటిలాగా వ్యవసాయం చేసుకోవచ్చని మాత్రమే చెప్తున్నారని అన్నారు. రైతులకు పంట నష్టంతో కలిపి పూర్తి నష్టపరిహారాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో పల్నాడు జిల్లా కలెక్టర్ అక్కడి రైతులకు పంట నష్టంతో సహా పూర్తి నష్టపరిహారం చెల్లించి పైపులైను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.



పైపులైన్లను పరిశీలిస్తున్న వి కృష్ణయ్య

పేర్నమిట్ట గ్రామంలో చెరువులోపల నుంచి బయటకు పైపులైన్ వేయాలని రైతులు పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిలారి పెద్దబ్బాయి, అన్నం సుబ్బారావు, కరిచేటి హనుమంతరావు, భత్తుల సుబ్బారావు, గుండవరపు రామయ్య, ఆళ్ల అంజయ్య, మైనంపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.



దుర్గగుడిలో దసరా మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

సామాన్య యాత్రికులకు ప్రాధాన్యత

- దసరా మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్షలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం

ప్రజాశక్తి- వన్‌టౌన్ (విజయవాడ)

దసరా ఉత్సవాల సందర్భంగా సామాన్య యాత్రికులకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 13 శాఖలూ సమన్వయంతో పనిచేయాలన్నారు. సందర్శకులకు క్యూ లైన్లలో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 250 సిసి కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. వివిఐపి దర్శనాలు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి పది గంటలకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు సమయం కేటాయించాలని సూచించారు. ఈ సమయంలో సామాన్య సందర్శకుల క్యూలైన్లు ఆపవద్దన్నారు. వృద్ధులకు, వికలాంగులకు సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు దర్శనం కల్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతరాలయ దర్శనానికి అనుమతి ఇవ్వొద్దన్నారు. అన్నప్రసాదాలు, లడ్డులో నాణ్యత ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈసారి వాటర్ ప్యాకెట్లతోపాటు వాటర్ బాటిళ్లను కూడా (35 లక్షల బాటిల్స్) ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రత చేయాలని సూచించారు. ముఖ్యఅతిథిగా రావాలని కోరుతూ సోమవారం వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని స్వయంగా తాను ఆహ్వానిస్తానన్నారు. అక్టోబర్ 9వ తేదీ మధ్యాహ్నం మూలా నక్షత్రం రోజున అమ్మవారికి ప్రభుత్వ లాంఛనాలతో పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి, కలెక్టర్ సృజన, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఆలయ ఇఒ కెఎస్.రామారావు స్వాగతం పలికారు.

కల్తీ నెయ్యిపై ఆధారాలుంటే అరెస్టు చేయకుండా సిట్ ఎందుకు?


- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగినట్లు ఆధారాలుంటే అరెస్టులు చేయకుండా సిట్ పేరుతో హడావిడి ఎందుకు చేస్తున్నారని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వందరోజుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సిఎం చంద్రబాబు తిరుమల లడ్డూ విషయంలో దుష్ప్రచారాన్ని మొదలుపెట్టారని విమర్శించారు. లడ్డూలో కల్తీ జరగలేదని టిటిడి ఇఒ మీడియాకు వివరించినా.. చంద్రబాబు అబద్ధాలను మానడం లేదన్నారు. చంద్రబాబు మాటలకు, టిటిడి ఇఒ మాటలకు పొంతన వుండటం లేదన్నారు. కల్తీ జరిగి వుంటే ఇన్ని రోజులుగా ప్రభుత్వం అరెస్టులు చేయకుండా ఏమి చేస్తుందని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి రాజకీయం చేస్తారా అని చంద్రబాబును ప్రశ్నించారు. జులై 23న రిపోర్టు వస్తే సెప్టెంబరు 19 వరకు రెండు నెలలపాటు ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. రెండు నెలలపాటు ల్యాబ్ రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనకు తాను సనాతన ధర్మ పరిరక్షకుడిగా చెప్పుకుంటారని, ఆచరణలో అంతా వ్యతిరేకంగా పనిచేస్తున్నారని విమర్శించారు.

అరాచక పాలన : మేరుగ నాగార్జున

రాష్ట్రంలో అరాచక పాలనకు కూటమి ప్రభుత్వం కేంద్రంగా మారిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల్లో ఏమీ చేయకుండా ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అధికారులను, ప్రతిపక్షాలను చివరకు ప్రశ్నించే సొంత పార్టీ నేతలను కూడా వదలడం లేదని అన్నారు. కొలికిపూడి శ్రీనివాస్ మొదటి నుండి వున్న తెలుగుదేశం కార్యకర్తలను, మీడియాను బహిరంగంగానే బెదిరిస్తున్నారని అన్నారు. అలాగే కాకినాడలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌పై చేయిచేసుకున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు.. అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగిస్తే చర్యలు లేవన్నారు. అలాగే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజలపై దౌర్జన్యాలు చేశారని తెలిపారు. వీటిపై సిఎం చంద్రబాబు ఏమాత్రం స్పందించకపోవడం సరైంది కాదన్నారు.



బాలాజీ దంపతులను అభినందిస్తున్న నాయకులు

బాలాజీ సేవలు మరువలేనివి

- ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కెవి శివారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో సబ్ రిజిస్ట్రార్‌గానేకాక సాటి ఉద్యోగుల సమస్యలపై గళమెత్తుతూ... నాయకుడిగా ఉంటూ.. ఉద్యోగ విరమణ చేస్తున్న బాలాజీ సేవలు మరువలేనివని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కెవి శివారెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంటులో వివిధ హోదాలో పనిచేయడంతోపాటు రిజిస్ట్రేషన్ శాఖలో అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, గిరిజన సంఘాల్లో, ఎన్‌జిఒ సంఘంలో వివిధ హోదాల్లో పనిచేసిన బాలాజీ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవి శివారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలాజీ జాతీయ స్థాయిలోనూ గిరిజన ఉద్యోగుల సంఘానికి సలహాదారుగా ఉన్నారని, ఉద్యోగులకు సంబంధించిన అనేక ఉద్యమాలలో మంచి పాత్ర పోషించారని అన్నారు. సామాజికంగానూ గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న కిడ్నీ సమస్యలను జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లి పోరాటం చేశారని తెలిపారు.

ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. బాలాజీతోపాటు కుటుంబం కూడా నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు కుటుంబమని తెలిపారు. పోలవరం నిర్వాసిత గిరిజనుల సమస్యలను రాష్ట్రపతి స్థాయికి తీసుకెళ్లి పరిష్కరించడంలోనూ బాలాజి కృషి వుందని పేర్కొన్నారు. అనంతరం బాలాజీ దంపతులను మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, సిపిఎం సీనియర్ నాయకులు పి మధు, సిహెచ్ బాబూరావు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు రామారావు, ప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించారు.

బాంబే హైకోర్టు తీర్పుతో... డిజిటల్ మీడియాకు ఊరట

- ఐటీ రూల్స్ సవరణలను తోసిపుచ్చిన న్యాయస్థానం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఐటీ నిబంధనలకు తీసుకొచ్చిన సవరణలను బాంబే హైకోర్టు ఇటీవల కొట్టివేయడం డిజిటల్ మీడియాకు పెద్ద ఊరట ఇచ్చింది. ఈ సవరణలు భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ఆర్టికల్ 19-1 (ఏ) సహా పలు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమ వేదికలలో అవాస్తవమైన లేదా తప్పుదోవ పట్టించే సమాచారాన్ని గుర్తించేందుకు ఫాక్ట్ చెక్ యూనిట్ (ఎఫ్‌సీయూ)ను ఏర్పాటు చేయడానికి ఈ సవరణలు కేంద్ర ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టిన విషయం తెలిసిందే.ప్రభుత్వ సవరణలను వ్యతిరేకిస్తూ సెటైరిస్ట్ కునాల్ కమ్రా బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డిజిటల్ మీడియాపై సెన్సార్‌షిప్ విధించేందుకు కేంద్ర ప్రభుత్వానికి విశేషాధికారాలు కల్పించే ఈ సవరణలు కోర్టు తీర్పుతో ఇప్పుడు అటకెక్కాయి.

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా

- 13 మంది మహిళా కార్మికులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాకొట్టిన ఘటనలో 13 మంది వ్యవసాయ కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఒంగోలు-నంద్యాల రాష్ట్ర రహదారిపై మర్రిపూడి మండలం అగ్రహారం గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి మండలం కాటూరివారిపాలెం గ్రామానికి చెందిన 25 మంది మహిళా కార్మికులు వ్యవసాయ పనుల నిమిత్తం చీమకుర్తి మండలం కంభంపాడు గ్రామం వెళ్లి తిరిగి సాయంత్రం ట్రాక్టర్ ఎక్కి ఇంటికి బయలుదేరారు. ట్రాక్టర్ ఇంజిన్, ట్రక్కు సంబంధించిన చింతకాయ విరిగిపోవడంతో ట్రక్కు అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అగ్రహారం గ్రామస్తులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించడంతో వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మన్నెం పద్మ, దేరంగుల విజయ, వల్లపు ధనలక్ష్మి, నాగాల కల్యాణి, గొబిశం రజిత, బొల్లినేని సుభాషిణిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆస్పత్రికి తరలించారు. వల్లెపు సుమలత, కుంచాల ఆదిలక్ష్మి స్థానిక ఉడుముల వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : సిపిఎం

ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. ప్రమాదంలో గాయపడి హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే మహిళలు ప్రమాదంలో గాయపడడం బాధాకరమన్నారు.

అందరి కోసం అమరావతి రన్

- మంగళగిరిలో ప్రారంభించిన సినీ నటుడు నిఖిల్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరిలో సినీ హీరో సిద్దార్థ నిఖిల్ ఆదివారం సందడి చేశారు. మంగళగిరి ఆటోనగర్‌లోని రాయల్ దత్ హోటల్ వద్ద 'అందరి కోసం అమరావతి' పేరుతో నిర్వహించిన 3కె, 5కె, 10కె రన్‌ను ఆయన ప్రారంభించారు. వివైబి స్పోర్ట్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 6 వేల మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ.. గుండె జబ్బులపై అవగాహన పెంచేందుకు అందరి కోసం అమరావతి పేరుతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లుగా చెప్పారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. జీవన శైలిలో మార్పులే వ్యాధులకు కారణమని, అందరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక దష్టి పెట్టాలని కోరారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల విజయవాడకు వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టడంతో వరద బాధితులు త్వరగా కోలుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ క్రీడాకారిణి ఎర్రాజు జ్యోతి, కాంటినెంటల్ కాఫీ పౌడర్ తరపున బలరాం, మంగళగిరి ఎపిఎస్‌పి ఆరో బెటాలియన్ కమాండెంట్ కె నగేష్ బాబు, ఫ్రీడం ఆయిల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలకవర్గ స్వభావం మారితేనే సమసమాజం

- లెనిన్ శతవర్ధంతి సభలో ప్రొఫెసర్ వికె రామచంద్రన్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

'అధికార మార్పిడి జరిగినంత మాత్రానా సమసమాజ స్థాపన సాధ్యం కాదు.. పాలకవర్గ స్వరూపంలోనే మార్పు రావాల్సి ఉంది' అని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ప్రొఫెసర్ వికె రామచంద్రన్ తెలిపారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా 'రాజ్యం-విప్లవం' అన్న అంశంపై అనంతపురంలోని అలేఖ్య ఫంక్షన్ హాలులో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రామచంద్రన్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రన్ మాట్లాడుతూ.. నేటి పెట్టుబడిదారి వ్యవస్థలో పేద, ధనికుల మధ్య అంతరాలు అనివార్యమని మార్క్స్, లెనిన్‌లు ఇద్దరూ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేశారని గుర్తు చేశారు. ఈ సమాజంలో పాలకవర్గాలన్నీ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పని చేస్తాయని తెలిపారు. అందుకే సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమని వివరించారు. రష్యాలో సోవియట్ పతనమైన తరువాత పెట్టుబడీదారి వ్యవస్థ మరింత బలపడిందన్నారు. మన దేశంలోనూ స్వాతంత్రానికి పూర్వం సమసమాజ భావనలే అధికంగా ఉండేవని తెలిపారు. అయితే క్రమంగా మారుతూ బడా పెట్టుబడి,పెట్టుబడి, భూస్వామ్య లక్షణాలు పెరిగాయని పేర్కొన్నారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలు దేశంలో అమలు చేయడం ప్రారంభించాక మరింత వేగవంతమయ్యాయని, దీనికి మతతత్వం కూడా తోడైందని తెలిపారు. అప్పటి నుంచి ఆర్థిక అంతరాలు మరింతగా పెరిగాయని పేర్కొన్నారు. మరోవైపు పేదరికం, దారిద్ర్యం కూడా పెరుగుతోందని తెలిపారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదన్నారు. ఇది యునెస్కో చెబుతున్న గణాంకాలేనని వివరించారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ అంతరాలు పోవాలంటే పాలకవర్గ స్వభావం మారాల్సి ఉందని తెలిపారు. స్వభావం మారడమంటే సమాజ మార్పు జరగాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో లెనిన్ ఆలోచనలను మరోమారు పునరుచ్చరణ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. అందుకోసమే ఆయన శతవర్ధంతి సభలను రాష్ట్రంలో ప్రత్యేకంగా ఈ ఏడాది నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.సావిత్రి, ఒ.నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేరళ ప్రభుత్వ ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ వికె. రామచంద్రన్

నేటి నుంచి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఓటర్ల నమోదు ప్రక్రియ నవంబరు 6 వరకు జరగనుంది. మార్చిలో కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్స్, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకు ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు పదవీకాలం మార్చితో పూర్తవుతున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-18 ద్వారా తమ ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఎన్నికలు జరిగే జిల్లాల పరిధిలో నివసించే వారు (ఆధార్‌లో ఉన్న అడ్రస్ ప్రకారం) వారందరూ గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారైనా ఆధార్ అడ్రస్ స్థానికంగా ఉంటే ఆ యువత గ్రాడ్యుయేట్ ఎక్కడ పూర్తి చేసినా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో ఫారం-18 ద్వారా ఓటు రిజిస్టర్ చేసుకున్నవారు, అధికారులు వెరిఫికేషన్‌కు అధికారులు దరఖాస్తుదారుల ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఒరిజనల్ సర్టిఫికెట్స్ చూపించాల్సి ఉంటుంది. ఓటు హక్కు నమోదు చేసుకునే అభ్యర్థులు డిగ్రీ, గ్రాడ్యుయేషన్ ప్రొవిజినల్ సర్టిఫికెట్ జెరాక్స్ కాపీ, ఆధార్ జెరాక్స్ కాపీ, ఓటర్ ఐడి జెరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, మొబైల్ నెంబర్ జతచేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదు చేయించుకున్న ఓటరు రసీదు జాగ్రత్త పరుచుకోవాల్సి ఉంటుంది. కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ ఓటును నమోదు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జాని పాషా విజ్ఞప్తి చేశారు.



జస్టిస్ చంద్రచూడ్‌కు తిరుమల రంగనాయకుల మండపంలో శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టిటిడి ఇఒ శ్యామలరావు

శ్రీవారిని దర్శించుకున్న సిజెఐ జస్టిస్ చంద్రచూడ్

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఆదివారం దర్శించుకున్నారు.

వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు

జస్టిస్ చంద్రచూడ్ తిరుపతి జిల్లాలో రెండ్రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణమయ్యారు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి అండ్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ ఆఫ్ చిత్తూరు జిల్లా జస్టిస్ పి కష్ణమోహన్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఎపి హైకోర్టు జస్టిస్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్ ప్రోటోకాల్ హైకోర్టు ఆఫ్ ఎపి జస్టిస్ రాఘవ స్వామి, రిజిస్ట్రార్ మేనేజ్మెంట్ హైకోర్టు ఆఫ్ ఎపి జస్టిస్ రామకష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సాదర వీడ్కోలు తెలిపారు.

చేనేతలకు అండగా నిలబడదాం

- హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పండగలకు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను ఆదరిద్దామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపు మేరకు తెలుగు ప్రజలు.. చేనేతలకు అండగా నిలవాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రంగులు అద్దుతూ చెమటోడ్చి చేనేతల బతుకు చిత్రం మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. రాబోయో రోజుల్లో వరుస పండగల నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాలను చాటే వస్త్రాలను ధరించడంతోపాటు చేనేతల కళారూపాలకు పెద్దపీట వేయాలన్నారు.

భువనేశ్వరికి ధన్యవాదాలు : మంత్రి సవిత

చేనేత కార్మికులకు అండగా నిలిచిన నారా భువనేశ్వరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దసరా, దీపావళి పండగలకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేద్దామని ఆమె పిలుపునివ్వడం సంతోషించదగ్గ పరిణామమన్నారు.

పంట నష్ట పరిహారం పెంచాలి

- వరద బాధితులను ఆదుకోవాలి
- రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా దశల వారీ ఉద్యమం : కె ప్రభాకర్ రెడ్డి



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న కె ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల (ఏలూరు జిల్లా)

వరికి ఎకరాకు రూ.25 వేలు, ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50 వేలు ఇన్‌పుట్స్ సబ్సిడీ అందించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో మూడ్రోజులపాటు రైతు సంఘం రాష్ట్ర స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు జరిగాయి.

చివరి రోజు ఆదివారం నిర్వహించిన విస్తృత సమావేశంలో రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. గ్రామస్థాయిలో రైతు సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని రైతాంగ సమస్యలు పరిష్కారం కావాలంటే రైతులంతా సంఘటితం అవ్వాలన్నారు. ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలకు పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద నష్టాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అన్ని పంటలకూ పంటల బీమా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది సంభవించిన కరువు, మిచౌంగ్ తుపాన్ వల్ల పంట నష్టానికి పరిహారం అందించాలన్నారు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో జరుగుతున్న దీక్షల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఉద్యమాలకు సమాయత్తం కావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఆయిల్ పామ్, కొబ్బరి, జీడి, చెరకు తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివశంకరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె మోహన్‌రావు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, విజయనగరం జిల్లా కార్యదర్శి రాంబాబు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి, గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ జివి సుబ్బారావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి - గోరంట్ల (శ్రీసత్యసాయి జిల్లా)

పిడుగుపాటుకు గురై భార్యాభర్తలు మృతి చెందిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోరంట్ల మండలంలోని దిగువ గంగంపల్లికి చెందిన దశరథ నాయక్ (50), ఆయన భార్య దేవి బాయ్ (45) తమకు చెందిన పాడి ఆవుల నుంచి పాలు పితకడానికి తెల్లవారుజామున 5 గంటల సమయంలో తమ ఇంటి పక్కనే ఉన్న షెడ్డులోకి వెళ్లారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వారు ఉన్నచోట పిడుగు పడటంతో భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే చనిపోయారు. అక్కడే ఉన్న రెండు పాడి ఆవులు మృతి చెందాయి. అదే షెడ్డులో నిద్రిస్తున్న దశరథ నాయక్ కుమారుడు జగదీష్ నాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో సమీప బంధువులు ఆయనను పుట్టపర్తి ఆస్పత్రికి తరలించారు. సిఐ శేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేస్తున్నారు.

కష్టాల్లో లేయర్ కోళ్ల పరిశ్రమ


- బేజారెత్తిస్తున్న మేత ధరలు
- పెంపకంపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోతోంది. మేత ధర ఆకాశాన్నంటడం, గుడ్ల ధరలు ఎగుడు దిగుడులతో ఉత్పత్తిదారులు నష్టపోతున్నారు. క్రమేణా లేయర్ కోళ్ల పెంపకానికి దూరమవుతున్నారు. దీంతో, కొన్ని ప్రాంతాల్లో ఇందుకు సంబంధించిన షెడ్లను సైతం తొలగిస్తున్నారు. గుడ్లు ఉత్పత్తి చేసే లేయర్ ఫౌల్ట్రీ ఫారాల్లో కోళ్లకు అందించే దాణాలో 55 శాతం మొక్కజొన్న, నూకలు వాడతారు. గత రెండేళ్లగా నూకలు, బియ్యం, మొక్కజొన్న తదితరాలు ఇథనాల్ పరిశ్రమలకు ఎక్కువగా తరలిపోతుండడంతో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. రెండేళ్ల క్రితం మొక్కజొన్న ధర టన్ను రూ.19,500 ఉండేది. ప్రస్తుతం రూ.27 వేలకు చేరింది. నూకలు ధర రూ.18 వేల నుంచి రూ.28 వేలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గత ఆగస్టులో ఎన్నడూ లేనివిధంగా కోళ్ల మేత ధర టన్ను రూ.30 వేలకు చేరుకుంది. ప్రస్తుతం కొద్దిగా తగ్గినా గతేడాదితో పోలిస్తే టన్నుకు రూ.2 వేలు అధికంగా ఉంది. గతేడాది టన్ను మేత రూ.25 వేలకు విక్రయించగా, తాజాగా రూ. 27 వేలకు విక్రయిస్తున్నారు. కోళ్ల ఫారం నిర్వహణ, గుడ్ల ఉత్పత్తికి ముందు కోడి పెంపకం, రోజువారీ మేతలు, విద్యుత్, ఇతర ఖర్చులన్నీ కలుపుకుంటే ఒక గుడ్డు ఉత్పత్తికి సగటున రూ.4.95 వ్యయం అవుతోందని ఫౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు రైతులకు గుడ్ల ధర సగటున రూ.4.90 మాత్రమే వచ్చింది. ఒక్కో గుడ్డుకు సగటున ఐదు పైసల వరకు నష్టపోయారు. కృష్ణా జిల్లా చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, మొవ్వ, బాపులపాడు, గన్నవరం మండలాల్లో, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, మైలవరం, విస్సన్నపేట తదితర మండలాల్లో కోటీ 25 లక్షల సామర్థ్యం కలిగిన గుడ్ల ఉత్పత్తి (లేయర్) చేసే కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం 80 లక్షల కోళ్లను మాత్రమే పెంచుతున్నారు. రాష్ట్రంలో ఆరు కోట్ల లేయర్ కోళ్ల పెంపకానికి సామర్థ్యం ఉన్నా, నాలుగు కోట్ల కోళ్ల మాత్రమే పెంపకం జరుగుతోంది. గిట్టుబాటు కాకపోవడంతో ఏలూరు జిల్లా నూజివీడులో 1.40 లక్షలు, కంకిపాడు, ప్రొద్దుటూరులలో 30 వేల సామర్థ్యం ఉన్న లేయర్ కోళ్ల షెడ్లను తొలగించారు.



అక్షరం
ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 | విజయవాడ
సోమవారం 30 సెప్టెంబర్ 2024



“కథను కల్పించడానికి గొప్ప ప్రతిభ ఉండాలి. కథల విలువ తెలుసుకోవడానికి ఎంతో పరిజ్ఞానం ఉండాలి. కథ చెప్పడానికి ఎంతో నేర్పు ఉండాలి. వినడానికి ఎంతో అభిరుచి ఉండాలి. బోధపరుచుకోవడానికి ఎంతో బుద్ధి సూక్ష్మత ఉండాలి. కథలు కళ్ళకి వెలుగిస్తాయి, బుద్ధికి పదును పెడతాయి, మనసుకి ఉత్సాహమూ ఉల్లాసమూ కలిగిస్తాయి.”

– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి



శిష్యా, మన్నించు!

గురువులోని గుణాలన్నిటినీ స్తుతిస్తూ
నీవు నా పాదాలను తడుపుతున్నపుడు
ఆత్మన్యూనత నన్ను ముంచెత్తింది.
బడిలో విగ్రహానికి పూజలు చేయిస్తున్నప్పుడు,
మూడు పదులపాటు నాలోని ఉపాధ్యాయుడు
ఇతరేతర విద్యార్థులు పొందే వ్యధను
అంచనా వేయలేని అజ్ఞాని.
విజ్ఞానం, ఆధ్యాత్మికత వైరిశిబిరాలనే జ్ఞానాన్ని
నీ తరం తలకు ఎక్కించలేని పిరికివాడు.
దైవశక్తికి కోట్లాది దేవుళ్ళ కల్పన స్వార్థపూరితమని,
మతదౌర్జన్యాలూ, యుద్ధాలూ నీచ రాజకీయమేనని
బోధించలేకపోయిన నిస్సహాయుడు!

మతోన్మాద దుమ్ముల గొండి
దేశాన్ని నమిలేస్తుందనే ఎరుకను
మీ మెదళ్ళకు ఎక్కించలేకపోయిన దద్దమ్మ!
పుట్టుకతో దైవాంశ సంభూతులు, అల్పులనే భావన
స్వార్థ నీచగుణమని, మానవులందరి జన్మలూ
ఒకలాంటివే అనే జ్ఞానాన్ని కలిగించలేని వ్యర్థుడు!
ఒకనాటి ఆటవిక బృందమే
విస్తార మానవజాతికి మూలమని,
కుల, మత, ప్రాంతాల ముళ్ళపొదల మధ్య
అన్నదమ్ములు విడిపోవడం బాధాకరమనే అవగాహన
ఏర్పరచలేక పోయిన నిస్సహాయుడు!
నీవిచ్చిన ఘనగౌరవానికి అనర్హుడు
శిష్యా నన్ను మన్నించు!

– గార రంగనాథం
98857 58123



గడ్డి పరకల గుసగుసలు

యిప్పలం యిప్పలం అంతారే
అసలు యిప్పలమంతే ఏందిరా?
యిప్పలమంతే పెను మార్పురా!

మారుపంతే... మనిసిలోనా?
మాటలోనా? బతుకులోనా?
ఇడమరి ఇవరంగా సెప్పురా!

మనిసీ మాటా రొండూ వొకటై
కాలంతో సాగిపోడమేన్రా!
నేలమీది తుప్పా డొంకా పుచ్చ పువ్వులై
మన బతుకు మొగసాల్లో
యిరగ బుయ్యడమేన్రా!
ఆకాసంలో మెరుపు తీగలన్నీ
మన కంటి కొసల్లోకి సేరి
కోతి కొమ్మచ్చి లాడుకోడమేన్రా!

ఎక్కడెక్కడో వున్న నదులూ సెరువులూ
లేడి కూనల్లాగ గెంతుకుంటా వొచ్చి
మన యిల్లముందు పిల్లా పాపల్తో కలిసి
పిచ్చిక గూల్లు కట్టుకోడమేన్రా!
ఇంద్రదనస్సు పందిరి కింద
సందమామను సంకనెట్టుకొని
సుక్కలన్నీ మన ముంగిట్లోనే
సెమ్మ సెక్కలాడుకోడమేన్రా!

ఇంకా సొస్టంగా సెప్పాలంతే
ఆకలీ దప్పికా లేని సమాజం
సీకులూ సింతలూ లేని సంసారం
అందరికీ సదువులు అందరికీ కొలువులు
అందరికీ ఆరోగ్యం అందుబాటులోకి తేడమేన్రా!

పేదోడూ గొప్పోడూ
పై కులపోడూ కడజాతోడూ
ఆ మతమోడూ యీ మతమోడూ
అన్న ఎంగిలి కురుపుల్నాటి తేడాలన్నీ
ఎండమావుల్లో నీల్లులాగ
ఎంతెతికినా కనబడకండా పోడమేన్రా!

ఏ ఆపీసులో ఏ మీటింగయినా
పెత్తందారీ మేనేజరు పక్కనే
కడజాతి కూలోడూ కూకోని
సలాలూ సమ్రదింపులూ
పాలూ నీళ్ళలాగ ఇచ్చి పుచ్చు కోడమేన్రా!
పోనుపోనూ కూలోడు మేనేజరవొచ్చు
మేనేజరు కూలోడూ అవొచ్చు!

అబ్బా... ఇంటానికి శేనా బాగుందిగానీ!
ఈ మార్పు సాద్దిమేనంతావా?

ఎందుకు సాద్దిం కాదురా
మన పక్కనున్న శ్రీలంకలో సాద్దిమయింది గదా
మనకీ అవుద్ది కాకపోతే...
ఇడియిడి గడ్డిపరకల్నాటి మనిమంతా
ఏకతాటి మీద నుమ్మజుట్టుకుని నిజాయితీ గల
కమ్మినిస్టు నాయకుల్ని అల్లుకుంతే
రాజ్యం మన పిడికిట్లోనే!
సట్టం మన వాకిట్లోనే!

– పతివాడ నాస్తిక్
94417 24167

బడిపిల్లల కవితలు .. ఒక పఠనానుభవం

బడి వయసులో నేను రాసిన చిట్టి పొట్టి కవితలను బడి పిల్లల కవితల పుస్తకం ‘దేవగన్నేరు’ గుర్తు చేసింది. పుస్తకాన్నయితే తమ్ముడు తగుళ్ల గోపాల్‌కు చెప్పి ప్రేమగా తెప్పించుకున్నాను కానీ దాన్ని అందుకున్న దగ్గర్నుంచి నాలో ‘నా చిన్నప్పటి కవితల’ కోసం ఒకటే ఆరాటం. ఇళ్లంతా వెతికినా కనిపించడం లేదు. ప్రతి మనిషి తన జీవిత ప్రయాణంలో ఎన్నెన్ని చోట్లకో ఇల్లు మారాల్సి వస్తుంది. అలా మారడంలో ఇవి ఎక్కడికెళ్లిపోయాయో తెలియలేదు. సొరుగులన్నీ శోధించి, చివరికి చిరాకొచ్చి కాసేపు బ్రేక్ ఇచ్చాను.

మళ్లీ ఒకసారి దేవగన్నేరు పుస్తకం దగ్గరికొచ్చి దాన్ని చేతుల్లోకి తీసుకున్నాను కదా. ఒక్కో కవితా చదువుతుంటే కళ్లలో తడి. నా బాల్యం నా కళ్ల ముందుకొచ్చి దర్జాగా నిలబడింది.


“ఏంటో చెప్పు?” అన్నట్టుగా చూసి నవ్వింది.

నేనూ నవ్వాను. నేనూ, బాల్యం, పుస్తకం ... ముగ్గురం కలిసి పేజీ పేజీ ప్రయాణం చేశాము.

చిన్నప్పుడు నా కవితా వస్తువులు అమ్మ, రైతు, బడి, ప్రకృతి, ఇల్లు ... అంతే! ఆ వయసులో పిల్లలు అవిగాక ఏం రాస్తారు? అది కూడా వాళ్లను స్వేచ్ఛగా తిరగనిస్తే, ప్రశాంతంగా పరిశీలన చేయనిస్తే. హాయిగా కూర్చుని రాయనిస్తే! నాలుగు గోడల మధ్య బంధించి ముఖమ్మీదికి పుస్తకాలు, సెల్ ఫోన్లు, ట్యాబులూ విసిరిస్తే ఆ మాత్రం ఆలోచన కూడా ఉండదు కదా.

తగుళ్ల గోపాల్ ప్రకృతి ఆరాధకుడు అనుకుంటాను. అతనికి దేన్నయినా స్వేచ్ఛగా వదిలేయడం తెలుసు. మట్టిలో కూడా అతను విత్తనాన్ని, కవిత్వాన్ని బలవంతంగా నాటడు. వాటినలా స్వేచ్ఛగా విసిరేస్తాడు. విసిరేసి అవి వృక్షంగా మారే రహస్యాన్ని శాంతంగా కూర్చుని పరిశీలిస్తాడు. అలా వదిలేసిన, విసిరేసిన పిల్లల మెదళ్ల నుంచి పుట్టిన సహజసిద్ధ కవితల పుస్తకం ఇది అని నాకు అర్థమైంది.

కొందరు పెద్దలు కవిత్వాన్ని తామే రాసి పిల్లల పేర్లు పెట్టి అబ్బురంగా చెబుతుంటారు. వాటిల్లో బాల్యం ఉండదు సరి కదా... అతి తెలివి ముందుకొచ్చి వెక్కిరిస్తుంది. బాల్యమంటే నిజాయితీ కదా. నిజాయితే కవిత్వం కదా. అది



లేని పుస్తకం ఎందుకు? వృథా. ఈ పుస్తకం రాసిన పిల్లల్లో అందరూ నాలుగు నుంచి ఏడవ తరగతి మధ్య చదువుతున్నవాళ్లే. వీళ్ల నిజాయితీ పుస్తకం నిండా పరుచుకుని, దాపరికం లేని స్వచ్ఛత మనల్ని కమ్మేస్తుంది.

పరిచయం

1
“మా అమ్మ కన్ను బంగారం మీద
మా నాన్న కన్ను సినిమాల మీద
నా చెల్లి కన్ను ఆటల మీద
నా కన్ను చదువుల మీద”

2
“నాన్నా ఒక పుస్తకం కొనియ్యవా.. అన్నాను
డబ్బులు లేవని కసురుకుండు
సాయంత్రం చూస్తే మందు దుకాణంలో”

3
“నాన్న అమ్మను కొట్టినప్పుడు
ఆమె ఏడుస్తుంది
ఒక కన్నీటి చుక్క
నేల రాలుతుంది
ఇలా ప్రతి ఇంట్లో
ఎన్ని కన్నీటి చుక్కలు రాలుతున్నవో”

మనమంతా చిన్నప్పుడు ఎలాంటి బేషజాలు లేకుండా అమాయకంగా ఈ తలకిందుల సమాజాన్ని నిలబెట్టి ప్రశ్నలు వేస్తుంటామే.. అది కూడా కవిత్వమే కదా! అసలు కవిత్వ స్వరూపమే ప్రశ్న కదా. మరి ప్రశ్న మరిచిన కవిత్వం, కవుల గురించి కూడా ఈ బాల కవితల పుస్తకం ఎరుక చేస్తుంది.

4
“అమ్మ ఆడపిల్లను కంటే నాన్న కొడతాడు
మరి నాన్నకు దెబ్బ తగిలితే
‘అమ్మా’ అని ఎందుకు అంటాడో?”,

5
“మనసు లేని అద్దంతో
మాటిమాటికి మాట్లాడతాం కానీ
మనసున్న అమ్మతో
అరక్షణం కూడా ఎందుకు మాట్లాడం?”

6
“చీకట్లో వెళ్తుంటే
వెలుగులా ముందుకొచ్చాడు నాన్న
అందరూ దేవుణ్ని పూజిస్తారు కానీ
నాన్నను పూజించరు ఎందుకో?”

7
“ప్రపంచాన్ని
గుడ్డివాళ్లు చూడలేకపోతే
ఆ ప్రపంచమే
గుడ్డివాళ్లను చూడాలి కదా?”

ఈ ప్రశ్నల్లో మనుషుల్లోని ద్వంద్వ వైఖరిపై నిలదీత లేదా? బాల్యం అంటే పరిశీలన కూడా. కాకి, గద్ద, పిల్లి, పాము, కుక్క, పొలం, గింజ అన్నీ పిల్లలకు అబ్బురాలే. అందుకే మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అన్నీ తమ కోసమే అని సంతోషిస్తారు పిల్లలు అన్నాడు శ్రీశ్రీ.

8
“చెట్టు
తాతయ్య చేతిలో ఊతకర్ర
అమ్మ చేతిలో వంటకర్ర
నాన్న చేతిలో గొడ్డలి
పాప చేతిలో చెక్క బొమ్మ”,

9
“అన్నం పడెయ్యడానికి నిమిషం చాలు
పండించడానికి ఆరునెల్లు కావాలి”,

10
“రొట్టె మీద
అమ్మ నీళ్లు చిలకరిస్తుంటే
ఆమె చేతిలో నుంచి
వాన కురిసినట్టు ఉంటుంది”,

11
“కృష్ణుడి మురళీగానం గొప్పదే కానీ
ఆ మురళీని చేసిన వేళ్లు ఇంకా గొప్పవి”,

12
“బంతి పువ్వును చూస్తుంటే
అమ్మా నాన్న
నా గుండెలో పూసినట్టు ఉంటుంది”,

13
“తెల్లవారగానే సూర్యుడు ఉదయిస్తాడు
ఊరు మొత్తం వెలుగుతో నిండుతుంది
అయితే ఆ వెలుగులో
మా అమ్మ ఇంకా మెరుస్తుంది”

బాల్యమంటే సహానుభూతి కూడా. కులమతాలు, అంతస్తుల తేడా లేకుండా అందర్నీ అక్కున చేర్చుకోవడం పిల్లల దగ్గరి నుంచి కాకుండా ఎవరి దగ్గరి నుంచి నేర్చుకోగలం?

14
“మేము చిన్న చేపలం
ఖాసీం తాత పెద్ద చాప
ఆ చేప మాకు రోజూ మధ్యాహ్నం
అన్నం పెడుతుంది”,

15
“నల్లగా ఉంటారని వెక్కిరించకూడదు
మనం అక్షరాలు రాసేది కూడా
నల్లటి బోర్డు మీదే కదా”,

16
“రోడ్డు మీద పిల్లలు ఆడుతున్నప్పుడు
మా అన్న ఆడలేకపోతున్నాడని
బాధ పడ్డాను
ఇంట్లో గిన్నెల చప్పుడైతే
నడవడం రాక
ఎక్కడ పడ్డాడో అని గిలగిల్లాడతాను”,

17
“మానాన్న మోటార్లు కడుతూ
రైతుల కన్నీరు తుడుస్తాడు”

... ఇలా పుస్తకం తిరగేసేకొద్దీ నాకు నా బాల్య కవితలు మళ్లీ మళ్లీ గుర్తురావడం మొదలుపెట్టాయి. ఇక కుదర్దని లేచి వెళ్లి ఈసారి కాస్త ఎక్కువ సేపు, ఇంకాస్త ఎక్కువ శ్రద్ధతో వెతికాను. వెతగ్గా వెతగ్గా రాత్రి పదకొండు గంటల సమయంలో కంప్యూటర్ టేబుల్‌కి ఉన్న రెండో డెస్కులోనే భద్రంగా చెదలు పట్టకుండా ఒక ప్లాస్టిక్ కవర్‌లో చుట్టిపెట్టిన పాతనోటు బుక్కు ఒకటి కనబడింది. ఈ నోటుబుక్కులోనే నేను నా కవితలను జాగ్రత్తగా అతికించి దాచుకున్నాను. ఆ బుక్కు తెరిచి చూద్దును కదా.. దేవగన్నేరు పూలు గలగలా రాలాయి. అన్నీ ఒకసారి చదువుకున్నాను. ఎప్పుడో 1999లో అనుకుంటాను.. నేను రాసిన ‘పంజరానికి విన్నపం’ అనే ఈ బాల కవితను మాత్రం మళ్లీమళ్లీ చదువుకుని స్వేచ్ఛను కళ్లలోకి నింపుకున్నాను.

“ఓ పంజరమా
అన్యాయాన్ని బంధించు
అక్రమాన్ని బంధించు
అధర్మాన్ని బంధించు
దుర్మార్గాన్ని బంధించు
అవినీతిని బంధించు
మోసాన్ని బంధించు
అంతేకానీ అవేవీ తెలీని
నోరు లేని పక్షిని మాత్రం బంధించకు”

బాల్య స్మృతులను తడుముకోవడం అయ్యాక మళ్లీ దేవగన్నేరు దగ్గరికొచ్చాను. అందులో ముందుమాటలో తగుళ్ల గోపాల్ ఇలా అన్నాడు : “ఓ ఇరవై ఏళ్ల తర్వాత ఈ పుస్తకంలో కవితలు రాసిన పిల్లలు వచ్చి మా సార్ మాతోని కవిత్వం రాయించిండు. దేవగన్నేరులో నా కవిత ఉందని మురిసిపోతారు. వాళ్ల కడుపున పుట్టినోళ్లకు కూడా చూపించుకుంటారు. ఇంతకన్నా నాకేం కావాలి..?”

అదే మాట నేనూ అంటున్నాను. ఇదే పిల్లలు ఇదే ఇరవై ఏళ్ల తర్వాత వచ్చి చిన్నప్పుడు మేము రాసిన కవిత్వం మీద షరీఫ్ సారూ ఒక పరామర్శ రాశారు అని అనరా? అలా అంటే అంతకన్నా ఇంకేం కావాలి? కానీ నేను పరామర్శ రాయలేదే.. పఠనం ఒక అనుభవం కాబట్టి నా అనుభవాన్ని పంచుకున్నానంతే. సారీ పిల్లలూ!

(ధర 150, పేజీలు 100,
సంప్రదించాల్సిన ఫోన్ : 83098 37260)

– వేంపల్లి షరీఫ్

6వ తెలంగాణా రచయితల సంఘం వార్షికోత్సవం

తెలంగాణా రచయితల వార్షికోత్సవ సభ అక్టోబరు 6వ తేదీ ఆదివారం హైదరాబాదులోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 6 గంటల వరకూ నాలుగు సెషన్లుగా సాగుతుంది. వివిధ సాహిత్య అంశాలపై ప్రసంగాలు, పుస్తకావిష్కరణలు, కవిసమ్మేళనం ఉంటాయి.

– నాళేశ్వరం శంకరం

4, 5 తేదీల్లో యూత్ లిటరరీ ఫెస్ట్ -2024

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించనున్నాం. ఇందులో యువ కవులు, రచయితలు తమ స్వీయ రచనలపై మాట్లాడతారు. నవల, కథ, విమర్శ, పాట, కవిత్వం అనే ఐదు అంశాలపై యువ రచయితలు (40 ఏండ్ల లోపువారు) చర్చలు చేస్తారు. అతిథులు సైతం యువతే ఉండటం ఈ ఫెస్ట్ ప్రత్యేకత. ఈ రెండు రోజుల ఫెస్ట్‌లో స్వీయ నవల విశ్లేషణ, స్వీయ కథా విశ్లేషణ, ఇప్పుడు వస్తున్న సాహిత్యాన్ని విమర్శనాత్మకం ఎలా చూడాలి, పాట (సినీ, జానపద, ఉద్యమ) పై గీత రచయితల అభిప్రాయాలు పంచుకుంటారు, వర్తమాన కవిత్వం – యువత రాస్తున్న కవిత్వంపై చర్చ, కవి సమ్మేళనం ఉంటాయి. యువ కళాకారులతో కళా ప్రదర్శన ఉంటుంది. వివరాలకు : 88977 65417.

– కె.ఆనందాచారి,
ప్రధాన కార్యదర్శి. తెలంగాణ సాహితి

సరళ శైలిలో సాంద్రత నింపే కవి



సందర్భం

కృష్ణా జిల్లా రచయితల సంఘం మహాసభలు నిన్న అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జరిగాయి. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నెలకొల్పిన కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆలూరి బైరాగి స్మారక పురస్కారం–2024 ఈ ఏడాది కవితా రంగంలో విశేష కృషి చేసిన బండ్ల మాధవరావుకు ప్రదానం చేశారు. బండ్ల మాధవరావు తెలుగు కవితా ప్రపంచంలో అందరికీ స్ఫూర్తిదాయకమైన కవి. ఎక్కడా అనుకరణకు లొంగని కవిత్వం అతడిది. విభిన్నమైన కవితా వస్తువులు, సహజమైన శైలి శిల్పం, మనిషిని పల్లెను ప్రేమించేతత్వం, నిరాడంబరత అతడి కవిత్వాన్ని పాఠకులకు చేరువ చేసాయి.

1991 నుంచి 2014 వరకు 23 ఏళ్ల సుదీర్ఘ కాలంలో మూడు కవితా సంపుటాలను వెలువరించాడు. చెమట చిత్తడి నేల (1998), స్పర్శ (2005), అనుపమ (2014). దృశ్య రహస్యాల వెనుక’ ఆ తర్వాత వచ్చిన కవితా సంపుటి. ఈ కవితా సంపుటిలో చాలా పదునైన కవితలు కనిపిస్తాయి. అమరావతిలో అంతర్భాగమై అంతరించి పోతున్న తన ఊరు అనంతవరం గురించి ‘ఊరి కల’ అనే ఒక దీర్ఘ కవితను 2017 డిసెంబర్లో వెలువరించాడు. నిద్ర పట్టనివ్వని నిద్రలోనూ అదే కల గురించి, మాట్లాడుతూ, “ఊరెళ్ళి రావాలి/ ఊరెళ్ళి రావాలి/ మా ఊరి మీద వీచే చివరి పైరగాలిని/ వంటికంటించుకోవడం కోసం/ ఒకే ఒక్కసారి/ ఊరి చెరువులోని బురదలో/ పొర్లాడిరావడం కోసం/ ఊరెళ్ళి రావాలి” అంటాడు.

అసాధారణంగా రాయటానికి చాలా ఎక్కువ కష్టపడాలి అంటారు కానీ, చాలా సులభంగా సాధారణంగా, సహజంగా రాయటానికే ఇంకా ఇంకా ఎక్కువ కష్టపడాలి అని తన కవిత్వం చదివితే అర్థం అవుతుంది. “గేదె పక్కలో పడుకొని/ నేను పడుతున్న ఆనందాన్ని/ ఎప్పుడు చూశాడో/ గేదె పక్కలో పడుకోవాలన్నాడో కవి”. “బహుశా కొన్నేళ్ల తర్వాత/ మా ఊరి వేప చెట్టు కింద అరుగు/ ఏ పురావస్తు తవ్వకాల్లోనో బయటపడవచ్చు/ అప్పుడు ఈ చరిత్రను మళ్ళీ/ తవ్వి తిరగబోసుకొంటాను”

ఊరికి వెళ్లడం అంటే అంత సులభమైన విషయం ఏమీ కాదని, అది చాలా భయపడే విషయం అని, భయపెట్టే విషయం అని ఈ కవిత చెబుతుంది. “అయినా ఊరెళ్లాలంటే భయం/ నీటిభయం/ బతుకు భయం/ జీవితాన్ని గూర్చి భయం /జీవించడాన్ని గూర్చి భయం/ నాలుగు మెతుకులు/ లోపలికెళ్లే దారిని గూర్చి భయం / మట్టినాది కానప్పుడు/ మొక్క నన్ను విడిచి వెళ్లినప్పుడు/ రేపటి రోజు/ మా అనంతారం కొండంతై/ నన్ను కలవరపెడుతుంటే/ ఊరెళ్లాలంటే భయం”

ఊరు ఏమైందో తెలిస్తే కళ్ళు చెమ్మగిల్లుతాయి, గుండెల్లో నొప్పి మొదలవుతుంది. డబ్బు వాసన వేసే మనుషులతోనే ఊరు మొత్తం నిండి పోతే ఊరు ఏమవుతుందో చూడండి.

“ఊరంటే ఇప్పుడు/ సరికొత్త భవనాలు/ రంగు రంగుల కార్లు/ ఇప్పుడు నేను ఊర్లోకి వెళితే/ ఎవరూ ఎప్పుడొచ్చావని అడగడం లేదు/ డబ్బు వాసనేస్తున్న మనుషులతో/ ఊరు ఉక్కిరి బిక్కిరి అవుతున్నది/ కళ్లముందే ధ్వంసమైపోయిన ఊరు/ నగరపు రెక్కల్ని తొడుక్కుంటున్నది/ శిథిలమైన సంబంధాలతో మనుషులు/ రెక్కల గుర్రాల మీద విహరిస్తున్నారు/ ఇప్పుడక్కడ ఊరు లేదు/ బంధువులు లేరు / బంధుత్వాలు లేవు /మట్టి లేదు / చెట్టు లేదు / పుట్ట లేదు/ ఊరు అంతరించిపోయింది”.అంతరించిపోయిన మానవ సంబంధాల గురించి, అంతరించిపోయిన పల్లె సంస్కృతి గురించి అంతరించిపోయిన ఊరి గురించి హృద్యంగా చెప్పాడు బండ్ల మాధవరావు. ఈ కవి ఎక్కువగా రాయడు. తనను తాను కానీ ఇతరులను కానీ అనుకరించడం ఉండదు. ఎక్కడా అనుసరణ ఉండదు. ఎంతో సాధన చేసే తప్ప ఇలాంటి అసాధారణ శైలి ఏర్పడదు. ఒక మంచి కవిత చదివితే ఒక మంచి మనిషి మనతో తోడున్నట్టు అనిపిస్తుంది. అలాంటి మంచి కవితలు ఆయన సాహిత్య సంపుటాల్లో ఎన్నో కనిపిస్తాయి. పేజీలు తిప్పే కొద్దీ, కఠినమైన సత్యాలు, చారిత్రక నిజాలు, సంఘర్షణలు, పోరాటాలు, గొప్ప ఆశలు, గొప్ప గొప్ప కలలు ఎన్నో కనిపిస్తాయి. చదివే కొద్దీ కవిత పాఠకుడిని తన లోపలికి రహస్యంగా లాక్కుంటుంది. ఒక సున్నితమైన అలజడిని రేపుతుంది. గతం ఏమిటో. వర్తమానం ఏమిటో అసలైన నిజాలు చెబుతూనే భవిష్యత్తు ఎలా ఉండబోతుందో హెచ్చరిస్తుంది. అణువణువుని, మనిషి మనిషిని ప్రేమించగలిగే హృదయ వైశాల్యం బండ్ల మాధవరావుకు ఉంది కనుకే అతని కవిత్వం తడితడిగా ఉంటుంది. కన్నీటి చెమ్మ ఉంటుంది. ఒక హెచ్చరిక ఉంటుంది. ప్రేమతత్వం ఉంటుంది, తాత్వికత ఉంటుంది, చారిత్రక రాజకీయ కోణంలో నుంచి సత్య దృష్టితో మనిషిని ప్రపంచాన్ని సమాజాన్ని అర్థం చేసుకోవడం ఉంటుంది. అతని కవిత్వాన్ని చదువుతుంటే ఒక మనిషిని చదివినట్టు ఉంటుంది.

ఉపాధ్యాయ రంగంలో, పాఠశాలల నిర్వహణ రంగంలో విశేషమైన అనుభవం ఉండటం, విద్యార్థులను విపరీతంగా ప్రేమించే మనస్తత్వం ఉన్న ఉపాధ్యాయుడు కాబట్టే పిల్లల పట్ల అతడికి గల ప్రేమంతా అతడి అక్షరాల్లోనే తెలుస్తుంది. అందుకే “నువ్వు ఏ భాషలో రాసినా/ నీ అక్షరాలకు లక్షలాది అక్షరాలు తోడుంటాయి/ నీ అక్షరాన్ని అగ్నిలో మండించు/ ఎప్పటికైనా సమస్త ఆయుధాల్నీ జయించే అంతిమ ఆయుధం అక్షరమే’ అంటాడు ‘అక్షరాలు’ అనే కవితలో. అక్షరాలు మనుషుల్ని ఎంతగా ఎలా ఆయుధాలలాగా భయపెట్టగలవో అతడు చెబుతాడు. ఈ కాలంలో ఏది నేరమవుతుందో చెబుతాడు. “ప్రశ్నించడాన్ని/ ఎదిరించడాన్ని/ ముందే నేర్చుకొన్నందుకు/ ఎగరడమే నేరమైపోయిందివాళ” అంటాడు ‘విడివిడిగానే’ అనే కవితలో. చాలా సున్నితంగా చెప్పే ఒక మాట చూడండి : “ఎదురైన వాళ్లను ప్రశ్నించిన మనం/ కలిసి నడిచొచ్చిన కాళ్ళనే విరగగొట్టుతున్నాం./ చేతుల్లోని పువ్వుల్ని గుర్తించకుండా/ మందుపాతరాల్ని అన్వేషిస్తున్నాం”

‘దృశ్య రహస్యాల వెనుక’ కవితాసంపుటి లోని యాభై కవితలు చాలా అద్భుతమైనవి మళ్లీ మళ్లీ చదివింప చేసేవి. చిత్తడి నేల, స్పర్శ, అనుపమ, ఊరి కల ... ‘దృశ్య రహస్యాల వెనుక’ కవిగా అతని ప్రయాణం నిర్విరామంగా కొనసాగుతూనే ఉందనడానికి ఉదాహరణలు. రాజకీయ అస్థిరత, మనుషులు వలసపోవడం, ఇండ్లు ఊర్లు పొలాలు మాయం కావడం, ఉన్నట్టుండి మనుషులు లేకుండా పోవటం, ఉన్నా ఉన్నట్టు లేకపోవడం, సాంద్రతతో కూడిన దుఃఖంతో కూడిన ఆవేశంతో కూడిన ఒక వెతుకులాట.. మనుషులు మాట్లాడినట్లు ఉండదు, పొలాలు మాట్లాడినట్లు ఉంటుంది. ఇండ్లు మాట్లాడినట్లు ఉంటుంది .ఒక సమూహం, ఒక సమాజం మాట్లాడినట్లు ఉంటుంది. అదే.. మాధవరావు కవిత్వం. విజయవాడలో జరిగే సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన ఆత్మీయంగా స్నేహహస్తం అందిస్తుంటారు. ఎన్నో పుస్తక ఆవిష్కరణలు, ఎన్నో సాహిత్య సభలు, మేలు కలయికలు... ఆయన ఒక మంచి స్నేహశీలి అని, గొప్ప సాహిత్య కార్యకర్త అని నిరూపిస్తాయి. ‘కవితా!’ మాస పత్రిక నిర్వహణలో, విలువైన సంచికల ఆవిష్కరణలో శ్రీశ్రీ విశ్వేశ్వర రావు గారికి ఆత్మీయుడిగా ఆయన అవిశ్రాంతంగా కొనసాగిస్తున్న సాహిత్య కృషి విలువైనది, విస్మరించలేనిది.

– పలమనేరు బాలాజీ

ప్రజావాగ్గేయకారుడా!

పల్లవి :
దారి దీపమే నీ పాట– పోరు రూపమే నీ పాట
కామ్రేడ్ సన్యాసిరావూ! కాంతి పుంజమే నీ పాట
విశాఖ విప్లవ తీరంలో– విస్ఫులింగమే నీ పాట
సుత్తీ కొడవలి నక్షత్రంగా–
స్ఫురిస్తోంది నీ పాట “దారి”

1
తూర్పు గాలిని తెచ్చింది – యారాడ కొండ
లాకౌట్ గేటిచ్చింది – చేతికెర్రజెండా
పాట స్పందనయ్యింది – గుండె కంజరయ్యింది
చైతన్యం నింపింది– పారిశ్రామిక వాడల నిండా “దారి”

2
కార్మిక వర్గం కదన ఘోషలో – కలసిన హృదయం
కష్ట జీవుల కంట నీటిలో – కరిగిన కవనం
నీ గీతం సమరపతాకం – నీ గీతం శాంతికపోతం
సైద్ధాంతిక శ్రుతిలయ తప్పని –
నీ గీతం సుప్రభాతం “దారి”

3
అందరినీ చూడగలిగిన– అంతర్ నేత్రం నీది
పాట స్పర్శతో పలకరించిన – ప్రేమగాత్రం నీది
చిక్కని చీకటి గుండెల చీల్చిన
వెలుతురు పాటల సూరీడా!
సమ్మె, ఘరావ్, బందులు నేర్పిన
ఉద్యమ గొంతుల సరిజోడా! “దారి”

(విశాఖలో ఇటీవల మరణించిన సీనియర్ ప్రజావాగ్గేయకారుడు జి.సన్యాసిరావుకు జోహార్లు)

– నల్లి ధర్మారావు
76609 67313

గడియారం 43వ సాహిత్య పురస్కార ప్రదాన సభ

డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 6 ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రొద్దుటూరులోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరుగుతుంది. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు ఈ సంవత్సరం సింహరాజ్ (డా.శింగరాజు శ్రీరామకృష్ణ ప్రసాదరావు, నెల్లూరు) రచించిన ‘శ్రీ శంభు భారతం’ (ఛత్రపతి శంభాజీ పద్య ప్రబంధం) కావ్యం ఎంపికైంది. ఆయనకు రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేయబడతాయి. ఈ కార్యక్రమంలో విహారి, కొండపి మురళీకృష్ణ, జింకా సుబ్రహ్మణ్యం, గడియారం వేంకట శేషశర్మ, ఎం.జానకిరామ్, డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా.మూలె రామమునిరెడ్డి, ముడియం కిశోర్ కుమార్, ఎస్.ఆర్.ప్రతాపరెడ్డి, అన్నవరం రామ్‌కుమార్, నంద్యాల సురేష్ కుమార్ పాల్గొంటారు.

– డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి,
కార్యదర్శి, రచన సాహిత్య వేదిక
99666 24276

నిరుద్యోగంపై అవాస్తవాలు

- ఇపిఎఫ్ఓపై కేంద్రం వాదనలో హేతుబద్ధత కరువు
- తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వ ప్రకటనలు
- మోడీ సర్కారు తీరుపై నిపుణులు, విశ్లేషకులు



న్యూఢిల్లీ : ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఓ)లో చేరే ఉద్యోగుల సంఖ్య ఆధారంగా దేశంలో ఉద్యోగాల కల్పన పెరిగిందని, ఇది తమ ప్రభుత్వ ఘనతేనని మోడీ సర్కారు చెప్పుకుంటున్నది. ఇపిఎఫ్ఓ సమాచారాన్ని దేశంలో ఉద్యోగాల కల్పనకు ముడిపెట్టటంలో హేతుబద్ధత లేదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. మోడీ సర్కారు అంకెల గారడీతో దేశంలోని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని చెప్తున్నారు.

2017, సెప్టెంబర్ నుంచి 2024, మార్చి మధ్య ఇపిఎఫ్ఓలో 6.2 కోట్ల మంది నికర చందాదారులు చేరారని ఇటీవల కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2021-24 మధ్య 8 కోట్ల కంటే ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పుకోవటానికి తాత్కాలికంగా ప్రభుత్వానికి ఇది కొంత వరకు ఉపశమనం కలిగించినా.. వాస్తవాలు సర్కారు వైఫల్యాన్ని బయటపడతాయని విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు.

2017, సెప్టెంబర్ నుంచి కవర్ అయ్యే పేరోల్ డేటాను 2018, ఏప్రిల్ నుంచి ఇపిఎఫ్ఓ విడుదల చేస్తున్నది. పేరోల్ డేటా ద్వారా ఇపిఎఫ్ఓలో తొలిసారి చేరుతున్నవారు, వైదొలుగుతున్నవారు, మళ్లీ చేరుతున్నవారి సంఖ్య తెలుస్తుంది. ఇపిఎఫ్ఓ నమోదులో నికర పెరుగుదలను ఉపాధి కల్పనకు ఆపాదించలేమని విశ్లేషకులు చెప్తున్నారు. ఇపిఎఫ్ కింద ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల సంఖ్యకు ఇప్పటికే ఉన్న కొందరు కాంట్రాక్టు కార్మికులు వచ్చి చేరటం ద్వారా ఇపిఎఫ్ఓ కింద నమోదయ్యేవారి సంఖ్య పెరుగుతుంది. వాస్తవానికి అక్కడ ఎలాంటి కొత్త ఉపాధి కల్పన జరగదని వారు వివరిస్తున్నారు. నికర కొత్త ఇపిఎఫ్ఓ నమోదు ఎప్పుడూ ఉపాధి కల్పనగానూ చెప్పలేమన్న కీలక విషయాన్ని గుర్తుంచుకోవాలని అంటున్నారు. కొందరు గతంలో పని చేసినా.. ఇపిఎఫ్ కవరేజ్ కిందకు రానివారు కూడా ఉంటారు. ఇలాంటి వారిని ఇపిఎఫ్ కవరేజ్ కిందకు తీసుకొచ్చి కొత్తగా ఉపాధి సంఖ్య పెరిగినట్టుగా చెప్పటం సరికాదని విశ్లేషకులు చెప్తున్నారు.

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్స్, ఇతర నిబంధనల చట్టం, 1952 ప్రకారం.. ఏదైనా సంస్థ ముందు 12 నెలల్లో 20 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉంటే.. సదరు సంస్థకు చట్టం నిబంధనలు వర్తిస్తాయి. ఒక సంస్థ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉండవచ్చు. రెగ్యులర్ (శాశ్వత) ఉద్యోగుల సంఖ్యను తక్కువగా ఉంచుతాయి. ఇతర కార్మికులు, ఉద్యోగులను కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులుగా ఉంటారు. ఈ సంస్థలు ఇపిఎఫ్ఓ పరిధిలోనే ఉన్నప్పటికీ.. నమోదు అవకాశం శాశ్వత ఉద్యోగులకు మాత్రమే పరిమితమై ఉంటుంది. కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులు, కార్మికులు మినహాయించబడతారు.

ప్రస్తుతం ఇపిఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ప్రయోజనం కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులకూ పొడగించే అవకాశం ఉన్నది. దీంతో ఇపిఎఫ్ఓ డేటాలో నూతన నమోదును చూడొచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే వీరంతా గతంలో ఉద్యోగులే. కాకపోతే ఆ సమయంలో ఇపిఎఫ్ఓలో చేరే అవకాశం లేదు. ఇప్పుడు ఆ అవకాశం ఉన్నది. ఇపిఎఫ్ఓలో వీరు వచ్చి చేరినంత మాత్రాన ఇక్కడ ఎలాంటి కొత్త ఉద్యోగాల కల్పన జరిగినట్టు కాదని నిపుణులు చెప్తున్నారు. ఉద్యోగుల సంఖ్య 20 లేదా అంతకంటే మించి ఉన్న సంస్థలు కూడా ఇపిఎఫ్ కవరేజ్ కిందకు వస్తుంటాయి. ఇది ఒక నిరంతర ప్రక్రియ. దీని కారణంగా కూడా ఇపిఎఫ్ఓలో నమోదు సంఖ్య పెరుగుతుంది. దీని ఆధారంగా కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల సంఖ్య పెరిగిందని చెప్పుకోవటం ఎంత మాత్రమూ సరికాదని నిపుణులు వాదిస్తున్నారు.

మోడీ పాలనలో ప్రధాన సమస్యగా నిరుద్యోగం

మోడీ పాలనలో భారత్‌లో నిరుద్యోగం ఇప్పటికే ఒక ప్రధాన సమస్యగా ఉన్నది. ఉద్యోగ, ఉపాధి కల్పన తలకు మించిన భారంగా మారింది. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలూ ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కోట్లాది సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించామని మోడీ సర్కారు చెప్పుకోవటం ఆశ్చర్యం కలిగించక మానదని విశ్లేషకులు చెప్తున్నారు. 2017-2022 మధ్య ఇపిఎఫ్ఓలో 6.2 కోట్ల నికర కొత్త నమోదు సంఖ్యను ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రయత్నాలుగా చూడలేమని అంటున్నారు.

కొత్త ఉద్యోగాల్లో భవితకు భరోసా ఏదీ?

క్లెమ్స్ (క్యాపిటల్, లేబర్, ఎనర్జీ, మెటీరియల్, సర్వీసెస్) డేటాబేస్ ఆధారంగా ఇపిఎఫ్ఓతోపాటు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) సమాచారాన్ని ఉటంకిస్తూ 2021-24 మధ్య భారత్‌లో 7.8 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని మోడీ సర్కారు వాదిస్తున్నది. పైన వివరించినట్టుగా అంకెల గారడీతో కేంద్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు. దేశంలో సృష్టించబడుతున్న కొత్త ఉద్యోగాల్లో నాణ్యత కరువైందని అంటున్నారు. సకాలంలో వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం, సేఫ్టీ పరికరాల అందజేత, రిటైర్మెంట్ తరువాత వారి భవితకు భరోసా కల్పించడం తదితర అంశాలపై ఎటువంటి స్పష్టత ఉండటం లేదని, కేంద్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని నిపుణులు విమర్శిస్తున్నారు.



అంతిమ వీడ్కోలు పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో .. పుష్పన్ (ఫైల్))

పోరాట యోధుడికి కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామంలో పుష్పన్‌కు అంత్యక్రియలు

తలస్సేరి : ఉద్యమంలో తుపాకీ తూటాలు తగలడంతో మూడు దశాబ్దాలుగా మంచానికే పరిమితమైనా పోరాట పథాన్ని వీడని పుష్పన్ (54)కు వేలాదిమంది కన్నీటి వీడ్కోలు పలికారు. ఇటీవల అస్వస్థతకు గురైన ఆయన కేరళలోని కోజికోడ్ బేబీ మెమోరియల్ ఆస్పత్రిలో శనివారం తుదిశ్వాస విడిచారు. పుష్పన్ భౌతికకాయానికి ఆదివారం సాయంత్రం స్వగ్రామం చోక్లి మేనప్రారంలో అంత్యక్రియలు నిర్వహించారు. 1994 నవంబర్ 25న యుడిఎఫ్ ప్రభుత్వ అవినీతి, విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా కూతుపరంబలో అప్పటి మంత్రి ఎంవి రాఘవన్‌కు నల్లజెండా చూపి, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పోరాడారు. పోలీసు కాల్పుల్లో కెకె రాజీవన్, కెవి రోషన్, శిబులాల్, బాబు, మధు ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్ తగలడంలో 24 ఏళ్ల పుష్పన్ వెన్నుపాము దెబ్బతింది. అప్పటి నుంచి చికిత్స పొందుతూనే సమకాలీన రాజకీయ, సామాజిక పరిణామాలపై స్పందించేవారు. కోజికోడ్ బేబీ మెమోరియల్ ఆస్పత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని శనివారం సాయంత్రం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యాలయం యూత్ సెంటర్‌కు తీసుకొచ్చారు. ఆదివారం కోజికోడ్ నుంచి కన్నూరుకు, ఆ తరువాత ఆయన స్వగ్రామం చౌక్లీకి తరలించారు. దారిపొడవునా వేలాదిమంది సిపిఎం, వామపక్ష నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు.

ఎంతోమందిలో సేవ చేయాలనే తపన

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సమాజానికి సేవ చేయాలనే తపన ఎంతో మంది ప్రతిభావంతుల్లో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం తన 114వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణతోపాటు ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు అత్యధిక మొక్కలు నాటాయని తెలిపారు. ఇదంతా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా జరిగిందన్నారు. 'మన్ కీ బాత్'లో వచ్చిన ఉత్తరాలు చదివినప్పుడు తన హృదయం విజయగర్వంతో నిండిపోతుందని అన్నారు. మన దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారని, దేశానికి, సమాజానికి సేవ చేయాలనే తపన వారిలో ఉందని పేర్కొన్నారు. మనదేశం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మేకిన్ ఇండియా కార్యక్రమం ప్రారంభించి పదేళ్లయిందన్నారు. ప్రతి రంగంలోనూ ఎగుమతులు పెరిగాయని, ఎఫ్‌డిఐలను ఆకర్షించడంలో ప్రభుత్వం పురోగతి సాధించిందని చెప్పారు. రానున్న పండగ సీజన్‌లో స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలను కోరారు.

ఉద్యోగాలివ్వండి

- ఢిల్లీలో డివైఎఫ్ఐ భారీ ప్రదర్శన



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఉద్యోగం ఇవ్వండి. లేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వండి' అని నినదిస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) కార్యాలయం వద్ద డివైఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన నిరుద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డివైఎఫ్ఐ ప్రతినిధి బృందం లెఫ్టినెంట్ గవర్నర్‌కు, ముఖ్యమంత్రికి డిమాండ్ల పత్రాన్ని సమర్పించింది. 'ఉద్యోగం ఇవ్వండి. లేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వండి.

షహీద్ భగత్ సింగ్ కలలను నెరవేరుస్తాం, నిరుద్యోగాన్ని పెంచే బిజెపి ప్రభుత్వ విధానాలు నశించాలి' అని నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగిన యువకులు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం వైపు కదం తొక్కారు. పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి యువకులను అడ్డుకున్నారు.

ప్రభుత్వ శాఖల్లో లక్షల పోస్టులు ఖాళీ

డివైఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సురేష్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రిక్తా కృష్ణస్వామి, అమన్ సైనీ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం యువతకు, ఉపాధికి వ్యతిరేకమని, దీనివల్ల దేశంలో, ఢిల్లీలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ నియామకాలు జరగడం లేదని, ప్రభుత్వ శాఖలను ప్రైవేటీకరిస్తూ, బడా పెట్టుబడిదారులకు అమ్మేస్తున్నారని అన్నారు. ఢిల్లీ గవర్నమెంట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేసుకున్న 20 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారని, నమోదు చేసుకోని వారు ఇంతకంటే ఎక్కువమంది ఉన్నారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ మోడీ ప్రభుత్వం, ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు అప్పగించిందన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు నియామక అధికారం ఉన్నప్పటికీ, నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. లెఫ్టినెంట్ గవర్నర్‌పై బిజెపి ఢిల్లీ రాష్ట్ర నాయకులు ఒత్తిడి తేకుండా ఉద్యోగాలు, లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలన్న తమ డిమాండ్‌కు మద్దతు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేయడానికి బదులుగా, మార్షల్, సివిల్ డిఫెన్స్‌లో ఉన్న యువకులను వారి ఉద్యోగాల నుండి తొలగించారని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షల పోస్టులను త్వరగా భర్తీ చేసి ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతికి స్వస్తి పలకాలని సూచించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సుమిత్, ఉపాసన, విజయ్ మహావీర్, ప్రియాంక మాట్లాడుతూ నిరుద్యోగ యువత అందరికీ నెలకు రూ.5 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పట్టణ ఉపాధి హామీ పథకం చట్టం చేయాలని, మాదకద్రవ్యాల వ్యాపారం నిషేధించాలని, ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకూ బతికే ఉంటా

- బహిరంగసభలో అస్వస్థతకు గురైన మల్లికార్జున ఖర్గే

శ్రీనగర్ : కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ అలసిపోనని, బతికే ఉంటానని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. జమ్ముకాశ్మీర్‌లోని కఠువా జిల్లాలో ఆదివారం ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. అదుపుతప్పి పడిపోబోయిన ఆయనను అక్కడున్న నేతలు పట్టుకుని, మంచినీళ్లు తాగించారు. ఆ తరువాత ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి తీసుకొస్తాం. అందుకోసం పోరాడుతూనే ఉంటాం. ఎనిమిది పదుల వయసులో ఉన్న నేను అప్పుడే చనిపోను. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ అలసిపోను. అప్పటివరకూ బతికే ఉంటా' అని అన్నారు.

నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ డిమాండ్

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యాన్ని నిర్వీరం చేసినందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ద్వారా మొత్తం ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌పై విచారణ జరిపించాలని కోరింది. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో స్కామ్ జరిగిందన్న ఆరోపణలపై నిర్మలా సీతారామన్, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాపై తాజాగా కేసు నమోదైన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు అభిషేక్‌సింఘ్వి ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా డబ్బు వసూలు చేసేందుకు నాలుగు పద్ధతులను బిజెపి ఉపయోగించిందని ఆయన విమర్శించారు. గతేడాది కాలంలో మీడియా ఎలక్టోరల్ బాండ్లపై అనేక కథనాలు, పేర్లను ప్రచురించాయని తెలిపారు. చాలా కేసుల్లో మొదట దర్యాప్తు సంస్థలు కంపెనీలపై దాడులు చేశాయని.. ఆ తర్వాత ఆయా కంపెనీలు చాలా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేశాయని చెప్పారు. బాండ్ల కొనుగోలు తర్వాత కేసుల దర్యాప్తు వేగం మందగించిందన్నారు. రూ.100కోట్ల మూలధనం లేని కంపెనీలు రూ.500కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం చూశామన్నారు. ఎలక్టోరల్ బాండ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే నాలుగో అంశమని సింఘ్వీ అన్నారు. ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే నిబంధన ఉందని.. కేసు ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు.



యెమెన్‌పై ఇజ్రాయిల్ దాడులు

సనా : గాజాలో మొదలు పెట్టి లెబనాన్, సిరియా, ఇరాక్‌కు దాడులను విస్తరింపజేస్తున్న యూదు దురహంకార ఇజ్రాయిల్ తాజాగా యెమెన్‌పై విరుచుకుపడింది. గత రెండు రోజులుగా హౌతీలు ఇజ్రాయిల్‌పై క్షిపణులను ప్రయోగిస్తున్నారన్న సాకుతో నెతన్యాహు ఆ దేశంపై దాడికి తెగబడ్డారు. పశ్చిమాసియా అంతటినీ యుద్ధంలోకి లాగాలని అమెరికాతో కలసి ఇజ్రాయిల్ యత్నిస్తున్నాయి. యుద్ధ విస్తరణకు ఇప్పటికే అనేక ఫ్రంట్‌లను తెరచిన ఇజ్రాయిల్ ఇప్పుడు యెమెన్‌ను కూడా యుద్ధంలోకి లాగుతోంది. డజన్ల కొద్దీ యుద్ధ విమానాలు హౌతీల స్థావరాలే లక్ష్యంగా ఆదివారం దాడి చేశాయని ఇజ్రాయిల్ మిలటరీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్ ఇసా, హోదీదా ఓడరేవులపైన, విద్యుత్ కేంద్రాలపైన బాంబుల వర్షం కురిపించి భీతావహమైన పరిస్థితిని సృష్టించింది.

నేపాల్ లో వరద బీభత్సం

- 148 మంది మృతి
- దెబ్బ తిన్న పలు జల విద్యుత్ ప్రాజెక్టులు



సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నేపాల్ రాజధాని ఖాట్మండులో వరద నీటిలో తన బిడ్డను తీసుకెళ్తూ అవస్థ పడుతున్న ఓ వ్యక్తి

ఖాట్మండూ (నేపాల్) : నేపాల్‌లో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి. కుండపోతగా కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడడం, వాగులు వంకలు పొంగి పొర్లడంతో ఇప్పటివరకు 148 మంది చనిపోయారు. 59 మంది గల్లంతయ్యారు. పదకొండు జల విద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతినిపోయాయి. విద్యుత్ ప్రాజెక్టులకు జరిగిన నష్టం 245 కోట్ల దాకా ఉంటుందని ప్రాథమిక అంచనా. ఇది కాకుండా ఆస్తినష్టం కూడా పెద్దయెత్తున ఉన్నట్లు నేపాల్ విద్యుత్ శాఖ మంత్రి దీపక్ ఖద్కా తెలిపారు.కొండచరియలు విరిగి పడడం వల్ల పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. పలు బస్సులు మట్టి పెళ్లల కింద చిక్కుకుపోయాయి. 3,660 మందిని ఆర్మీ, నేపాలీ సాయుధ దళాలు, పోలీసులు రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఒక్క ఖాట్మండూ వ్యాలీలోనే 73 మంది మరణించారు. కోషి రాష్ట్రంలో 17 మంది, బాగ్‌మతి ప్రావిన్స్‌లో 56 మంది చనిపోయారు. వరద ధాటికి పలు చోట్ల ఇళ్లు ధ్వంసమయ్యాయని, దాదాపు 1200 ఇళ్లు వరద నీటిలో మునిగాయని తెలిపారు..నేపాల్‌లో వచ్చిన ఆకస్మిక వరదలు బీహార్‌ను కూడా తాకే ప్రమాదముందని అధికారులు తెలిపారు.

విద్యార్థుల కోసం వినూత్నంగా...

కేరళలో ఎనిమిది లక్షల మందికి 'కైట్' శిక్షణ

తిరువనంతపురం : విద్యార్థులకు శిక్షణ, మార్గనిర్దేశం అందించేందుకు కేరళలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే ఎనిమిది లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారు. కైట్ అనేది కేరళ ప్రభుత్వ సాధారణ విద్యా శాఖలో సాంకేతిక విభాగం. 'ప్రవేశానికి కీలకం' పేరిట చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి శనివారం ప్రారంభించారు. సైన్స్, హ్యూమానిటీస్, కామర్స్ విభాగాలలో విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు, మద్దతు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం కీలక ఉద్దేశం అదేనని ఆదివారం ఓ ప్రకటనలో వివరించారు. కార్యక్రమం అమలు కోసం ప్రభుత్వం ఓ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలలో విద్యాభ్యాసం చేస్తున్న హయ్యర్ సెకండరీ, ఒకేషనల్ హయ్యర్ సెకండరీ విద్యార్థులు ఈ పోర్టల్‌లోకి ఉచితంగా లాగిన్ అవవచ్చు. అందులో ప్రశ్నాపత్రాలు, అసైన్‌మెంట్లు, మాక్ టెస్టులు వంటి విస్తృత సమాచారం ఉంటుంది. రోజువారీ లైవ్ తరగతులు ముగిసిన తర్వాత ఈ వనరులన్నీ అందుబాటులోకి వస్తాయి. లైవ్ తరగతులు నెల 30 నుండి కైట్ విక్టర్ ఛానల్‌లో ప్రసారమవుతాయి. వీటిని చూడలేకపోయిన విద్యార్థులు ఆ తర్వాత కైట్ యూట్యూబ్ ఛానల్‌లో వీక్షించవచ్చు. కార్యక్రమంలో భాగంగా ప్రారంభంలో రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం, గణితం, చరిత్ర, రాజకీయ శాస్త్రం, వ్యాపార అధ్యయనాలు, ఆంగ్లం, భూగోళ శాస్త్రం తరగతులు బోధిస్తారు. భవిష్యత్తులో ఇతర సబ్జెక్టులు కూడా అందుబాటులోకి వస్తాయి.

30 నుంచి హర్యానాలో రాహుల్ యాత్ర

చండీగఢ్ : వచ్చే నెల ఐదో తేదీన జరిగే హర్యానా శాసనసభ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నెల 30 నుంచి రాష్ట్రంలో యాత్ర చేపట్టబోతున్నారు. ప్రియాంక గాంధీ కూడా ఈ యాత్రలో పాల్గొనే అవకాశం ఉంది. కాంగ్రెస్ వర్గాలు అందించిన సమాచారం ప్రకారం 30వ తేదీ ఉదయం 11 గంటలకు నారాయణ్‌ఘర్ అసెంబ్లీ నియోజకవర్గంలో యాత్ర ప్రారంభం అవుతుంది. సాయంత్రం ఐదు గంటలకు కురుక్షేత్రలో ముగుస్తుంది. ఏడు నియోజకవర్గాల మీదుగా యాత్ర కొనసాగుతుందని పార్టీ వర్గాలు చెప్పాయి. అక్టోబర్ 3న ప్రచారం ముగిసే లోగా మరికొన్ని నియోజకవర్గాలలో కూడా రాహుల్ యాత్ర కొనసాగే అవకాశం ఉంది. ఇది పాదయాత్ర కాదని, రోడ్ షో వంటిదని ఓ కాంగ్రెస్ నేత చెప్పారు.

అంతర్జాతీయ సమాజం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఈ దాడుల తాలూకు పర్యవసానాల గురించి ఆందోళన వ్యక్తం చేశాయి. నస్రల్లా హత్యను పిరికిపంద, ఉగ్రవాద చర్య అని హమాస్ ఖండించింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దురాగతాలకు ప్రతిఘటన కొనసాగుతుందని స్పష్టం చేసింది. బీరుట్‌లో గత 24 గంటల్లో చోటు చేసుకున్న పరిణామాల పట్ల ఐరాస చీఫ్ అంటోని గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు.

జాత్యహంకారంతో ఇతరులపై దాడి చేసే ఇటువంటి చర్యలను తాము చూస్తూ ఊరుకోబోమని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమాఫోసా ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ లెబనాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే ఏ చర్యనైనా తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. పశ్చిమాసియాలో పరిణామాలకు ఇజ్రాయిలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇజ్రాయిల్ పాశవిక దాడులు పశ్చిమాసియా ప్రాంత భద్రతకే కాదు, ప్రపంచ శాంతికి, భద్రతకు పెను ముప్పు అని క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఆందోళన వ్యక్తం చేశారు. లెబనాన్‌పై మిలిటరీ చర్యను పశ్చిమాసియాలో పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీసేలా ఉందని రష్యా విదేంగ మంత్రి లావ్రోవ్ హెచ్చరించారు. లెబనాన్‌పై దాడిని సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్,యెమెన్ వంటి అరబ్బు దేశాలు ఖండించాయి. తక్షణమే దాడులను విరమించాలని ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, అర్జెంటీనా కోరాయి.

మరో హిజ్బుల్లా నేత నబిల్ కౌక్ హత్య
నస్రల్లా వారసుడిగా సఫీద్

దక్షిణ బీరుట్ పై ఇజ్రాయిల్ సైన్యం శనివారం జరిపిన క్రూరమైన దాడుల్లో హిజ్బుల్లాకు చెందిన మరో కీలక నేత నబిల్ కౌక్ మరణించాడు. హిజ్బుల్లా సెంట్రల్ కౌన్సిల్ అధిపతిగా ఉన్న కమాండర్ నబిల్ హత్యతో హిజ్బుల్లా ప్రధాన నాయకత్వాన్నంతటినీ అంతమొందించామని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. దీనికి ప్రతీకారం తప్పదని హిజ్బుల్లా సంస్థ హెచ్చరించింది. నస్రల్ హత్య హిజ్బుల్లా చరిత్రలోనే అతిపెద్ద దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. దీని నుంచి కోలుకునేందుకు నస్రల్లా స్థానంలో ఆతని బంధువు, హిజ్బుల్లా రాజకీయ విభాగం అధిపతిగా ఉన్న సఫీద్ నియమితులయ్యారు. 1964లో దక్షిణ లెబనాన్‌లో డెయిర్ కాన్సుల్‌లో జన్మించిన సఫీద్ ఆరేళ్ల క్రితం అమెరికా దాడి చేసి చంపిన ఇరాన్ మిలిటరీ చీఫ్ సులేమాన్‌కు మామ కూడా.



మహా పాదయాత్ర నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు, నిర్వాసితులు

మా పొట్టకొట్టాలని చూస్తే ఖబడ్దార్

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల విషయంలో మాత్రం 16 వేల మందికిగాను ఐదు వేల మందికి మాత్రమే ఉపాధి లభించిందని వివరించారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసేసి, ఉత్పత్తిని తగ్గించేసి ప్లాంట్‌ను సర్వనాశనం చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తుండడం అత్యంత దుర్మార్గమన్నారు. సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో అలసత్వాన్ని ప్రదర్శించడంతోనే నేడు ఈ గతి పట్టిందన్నారు. ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. కర్మాగారంలో తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, కార్మికుల ఆందోళనను గుర్తెరిగి ఎంపిలు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ రేసులో పలువురు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన సీటును తనకే ఇవ్వాలనే షరతును ఆయన పెట్టినట్లు సమాచారం. దీంతో మూడింట్లో ఒక సీటును టిడిపి తరపున బీదకు మరలా వచ్చే అవకాశం ఉంది. మరో సీటును ఎవరికి ఇస్తారనే ఉత్కంఠ టిడిపి నేతల్లో నెలకొంది. ఆశావాహుల్లో కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, మాజీ ఎంపిలు కంభంపాటి రామ్మోహన్‌రావు, గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్లు వినబడుతున్నాయి. వీరితోపాటు మరికొంత మంది నేతలు కూడా ఆ పార్టీ నుంచి ప్రయత్నిస్తున్నారు. కమ్మ సామాజిక తరగతి నుంచి గల్లా జయదేవ్ గానీ, కంభంపాటి రామ్మోహన్‌రావులలో ఒకరికి ఉండే అవకాశం ఉంటుంది. బిసి సామాజిక తరగతి నుంచి యనమల రామకృష్ణుడు, కనకమేడల రవీంద్రకుమార్‌కు అవకాశం ఉండొచ్చు. ఎస్‌సి సామాజిక తరగతి నుంచి వర్ల రామయ్యకు అవకాశం ఉంటుందని పార్టీ నేతలు అంటున్నారు. జనసేన నుంచి నాగబాబుకే అవకాశం ఉంటుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో నాగబాబు టికెట్ ఆశించినా ఎక్కడా పోటీ చేసే అవకాశం రాలేదు. దీంతో రాజ్యసభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. నాగబాబును ప్రతిపాదిస్తే వ్యతిరేకత రాదనే ఆలోచన ఆ పార్టీలో ఆలోచిస్తుంది.

టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

నెలకొన్నాయి. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థకు దిగ్గజ పెస్టిసైడ్ కంపెనీలతో సంబంధాలున్నాయి. ఇందులో కోర్టులో కేసును ఎదుర్కొంటున్న సింగెంట వంటి ఘరానా కంపెనీ కూడా ఉన్నది.

ఇక వి-ఫ్యూయెన్స్‌కు భారత్‌లో ఉన్న సంబంధాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సంస్థ ప్రయివేటు సోషల్ నెటవర్క్ బోనస్ ఈవెంటస్ వెయ్యికి మందికి పైగా యాక్సెస్‌ను కలిగి ఉన్నారు. ఇందులో ప్రపంచ ఆగ్రోకెమికల్ కంపెనీలు, లాబీయిస్టులు, ప్రభుత్వ సభ్యులు కూడా ఉన్నారు. బోనస్ ఈవెంటస్ కోసం ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా అమెరికా నుంచి ఫండింగ్ అందుతున్నది. ఆసియా, ఆఫ్రికాలలో హానికర పెస్టిసైడ్స్‌పై వచ్చే విమర్శలను తిప్పికొట్టటమే లక్ష్యంగా ఇది పని చేస్తున్నది. 2019లో క్రాప్‌లైఫ్ సభ్యుల కోసం ఒక శిక్షణా కార్యక్రమాన్ని సైతం వి-ఫ్యూయెన్స్ ఏర్పాటు చేసింది. అలాగే, మూడేండ్ల తర్వాత 'ఇండియా కెమ్ 2021' కార్యక్రమాన్ని ఫిక్కీ నిర్వహించింది. ఇందులో రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు కూడా భాగమయ్యాయి. వి-ఫ్యూయెన్స్ అధ్యక్షుడిగా బైర్నె ఇందులో పాల్గొని మాట్లాడటం గమనార్హం.

అయితే, వి-ఫ్యూయెన్స్ వ్యవస్థాపకులు బైర్నె.. తన నెట్‌వర్క్ వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా సేకరిస్తుందన్న ఆరోపణలను తోసిపుచ్చారు.

తమిళనాడు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు, ఉపముఖ్యమంత్రిగా శనివారం నియమితులైన ఉదయనిధి స్టాలిన్, అసెంబ్లీ స్పీకర్ తదితరులు హాజరయ్యారు. ఉదయనిధి ఇప్పటికే మంత్రిగా ఉన్నందున, డిప్యూటీ సిఎంగా నియమితులైనప్పటికీ, ఆయన ప్రమాణం చేయాల్సిన అవసరం లేదు. మంత్రులు చెజియాన్‌కు ఉన్నత విద్యా శాఖ, నాజర్‌కు మైనారిటీల సంక్షేమం, ప్రవాస తమిళుల శాఖ, రాజేంద్రన్‌కు టూరిజం శాఖలను సిఎం కేటాయించారు. మనీ లాండరింగ్ కేసులో ఇడి అరెస్టు చేసిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వి.సెంథిల్‌బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు. మూడు రోజుల క్రితం ఆయన విడుదల కావడంతో మళ్లీ మంత్రి పదవి దక్కింది.

ఉదయనిధి స్టాలిన్ తొలుత సినీ నిర్మాత, పంపిణీదారు, నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం డిఎంకె తమిళ వార్తా పత్రిక 'మురసోలి' బాధ్యతలు చూశారు. 2019లో డిఎంకె యువజన విభాగం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఎంకె స్టాలిన్ కూడా తొలుత ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఆ తరువాత సిఎంగా బాధ్యతలు చేపట్టారు. ఉదయనిధికి డిప్యూటీ సిఎం బాధ్యతలు అప్పగిస్తారని చాలాకాలం నుంచి ప్రచారం జరగ్గా, తాజాగా ఆ బాధ్యతలు అప్పగించడం విశేషం.



మీకోసం

అల్లంతో చేసిన టీని వేడిగా తాగడం వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

విద్య, వివేకం, పరిజ్ఞానం బావిలో నీళ్లలాంటివి. వాడుతున్న కొద్దీ ఊరుతూనే ఉంటాయి.

చిట్టి- అద్దం



చిట్టి అద్దం
ముందు చేరింది!
అద్దం చిట్టి
ముందు చేరింది!!

చిట్టి అద్దాన్ని చూసి
బుంగమూతి
పెట్టింది
అద్దం చిట్టిని చూసి
బుంగమూతి
పెట్టింది!!

చిట్టి అద్దాన్ని చూసి
చిన్నగ నవ్వింది!
అద్దం చిట్టిని చూసి
చిన్నగ నవ్వింది!!

చిట్టి అద్దాన్ని చూసి
ఎక్కిరిచ్చింది!
అద్దం చిట్టిని చూసి
ఎక్కిరిచ్చింది!!


చిట్టి
అద్దాన్ని చూసి
పిడికిలి
బిగించింది!
అద్దం చిట్టిని చూసి
పిడికిలి
బిగించింది.

చిట్టి అద్దంతో
చేయి కలిపింది!
అద్దం చిట్టితో
చేయి కలిపింది!!


– అమ్మిన వెంకట అమ్మిరాజు,
94407 08656.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి వరుస జవాబు మీరు రాబట్టండి.



నేను గీసిన బొమ్మ





కె. మధుకర్
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాంపూర్,
నిజాంపేట మండలం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మూగజీవులు చెప్పే పాఠం ...



మనం పరికించి చూస్తే చాలు; ఈ విశ్వంలో ప్రతిదీ ప్రేమను పంచమనే చెప్తుంది. మానవుని శ్రమ, మేధస్సులతో పాటు ఈ భూమ్మీద ఉన్న సకల చరాచర జీవరాశుల్లోని ప్రేమ కూడా మానవ పురోభివృద్ధికి కారణమైంది. ప్రేమరాహిత్యపు తనంలో కొట్టుకుపోతున్న మానవాళికి ప్రకృతి ఎప్పటికప్పుడు కొత్త పాఠాన్ని చెప్తూనే ఉంది.

మూగజీవులైన కుక్కలు మనుషుల పట్ల విశ్వాసంతో ఉంటాయి కానీ, నిజానికి మనుషులే వాటి పట్ల కృతజ్ఞతతో ఉండాలి. మనుషులు ట్రైనింగ్ పేరుతో కుక్కలకు ఏదో బోధించేసేమని, తెగ గొప్పలు పోతుంటారు. వాస్తవానికి ఒక కుక్కని దగ్గరికి తీసుకుంటే చాలు... విశ్వాస పాఠాన్ని బోధిస్తుంది. అవసరమైన చోట ఎదిరించి నిలిచే సంఘ చైతన్యాన్ని వివరిస్తుంది.

కుక్కలు మనుషులను ప్రేమించే కథలనూ, మనుషులు కుక్కలను ప్రేమించే కథలనూ చాలా వినే ఉంటాం. అయితే కుక్కలు తోటికుక్కలను ప్రేమించే కథలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఈ రోజున ఒక రెండు కుక్కలు– క్లియో, రెయిన్బో మనకొక పాఠాన్ని చెప్పబోతున్నాయి. మానవత్వం పలచనవుతోన్న తరుణాన ప్రేమమయమైన లోకంలోకి నడవమని తమను తామే ఉదాహరణలుగా చూపుతున్నాయి. రండి. క్లియో, రెయిన్బోలను పరిచయం చేసుకుందాం. అవి నేర్పే పాఠాన్ని చేతులు కట్టుకుని విందాం.

ఒకరికి ఒకరై ...

ఆ కుక్క పేరు రెయిన్బో. గుంటూరు లక్ష్మీపురం వీధుల్లో తారసపడొచ్చు. బాగా బతికిన మనిషి అన్న చందాన బాగా బతికిన కుక్కే. మంచి బ్రీడ్. కారణాలు తెలీదు. అప్పటివరకూ పెంచుకున్న వాళ్ళు రోడ్డున వదిలేశారు. బ్రీడ్ డాగ్స్‌ను పెంచేవాళ్లలో ఎక్కువ మంది వాటిని వీధి కుక్కలతో కలవనిచ్చేందుకు ఇష్టపడరు. కానీ, రెయిన్బో తీరు వేరు. రోడ్డు మీద పడ్డాక కొన్నాళ్ళు ఆహారం కోసం బాగా ఇబ్బంది పడింది. ఆ సమయంలో ఒకే ఒక్క రోజు ఒక గోధుమ రంగు కుక్క తన ఆహారాన్ని రెయిన్బోతో షేర్ చేసుకుంది. ఆరోజు నుంచీ ఇద్దరికీ స్నేహం కుదిరింది. ఆ తర్వాత కొన్నాళ్లకు ఒక కారు తొక్కడంతో గోధుమ రంగు కుక్క కాలు విగిరింది. ఒకే ఒక్కరోజు తనతో ఫుడ్ షేర్ చేసుకున్న స్నేహానికి ఈరోజు వరకూ ఆ గోధుమ రంగు కుక్క కోసం కూడా రెయిన్బోనే ఆహారాన్ని సంపాదిస్తుంది.



'క్లియో'తో సుజాత

మనిషిని తట్టిలేపింది!

చిన్నప్పుడు ఆ ఇంట్లో ఏడు కుక్కలూ, అక్షరాలా పద్దెనిమిది పిల్లులూ ఉండేవి. పల్లె వాతావరణంలో ఉండే ఆ ఇంటి చుట్టూ అవి స్వేచ్ఛగా తిరిగి, ఇంట్లో తినేసి చెట్ల కింద పడుకుని నిద్ర పోయేవి. వ్యవహారమంతా సహజంగా ఉండేది. అయితే కెరీర్ వాళ్లను నగరానికి తీసుకొచ్చి పడేసింది.

నగర జీవనం వల్లా, అపార్ట్‌మెంట్లలో ఉండటం వల్లా, ప్రవాస జీవితాల వల్లా ఆ కుటుంబం మళ్లీ

పిల్లుల్ని, కుక్కల్ని పెంచే సాహసం చేయలేదు. అయితే ఇంట్లోని చిన్ని పాప పట్టుబట్టడంతో ఒక జర్మన్ షెఫర్డ్ కుక్క పిల్లను తెచ్చుకున్నారు. బ్రీడ్ డాగ్‌ని తెచ్చుకోవాలనే పట్టింపు లేకపోయినా, తెల్సిన వాళ్ల ఇంట్లో అదే జాతి కుక్కని చూసి, ఇష్ట పడింది పాప. అలా క్లియో ఆ ఇంటికి వచ్చింది. అయితే ఆ కుటుంబం అత్యంత ప్రేమతో ఏమీ క్లియోను ఆహ్వానించలేదు. పాప కోరుకుంది కాబట్టి వచ్చింది, అంతే! ఎంతటి అయిష్టం చూపినా, దగ్గర చేరి ప్రేమలో పడేసే మాజిక్ జంతువులకు తెలుసు. అలా క్లియో కూడా ఆ కుటుంబాన్ని జయించి ప్రేమలో పడేసింది.

దాన్ని ఉదయం వాకింగ్‌కి తీసుకెళ్ళే డ్యూటీ ఆ పాప వాళ్ల అమ్మ సుజాతది.

ఆ కాలనీలో బ్రీడ్ కుక్కల్ని పెంచుకునే చాలామంది "ఇక్కడ వీధి కుక్కలు తిరుగుతుంటాయి. వాటిని దగ్గరకు రానీకండి. మన కుక్కలకి రోగాలు వస్తాయి" అని ఆమెని చాలా మంది హెచ్చరించారు. ఆమె మాత్రం వాకింగ్‌లో తమ వెంట వచ్చి క్లియోతో స్నేహం చేయాలనుకున్న ప్రతి వీధి కుక్కనూ దగ్గరకు రానిచ్చేది. చిన్ను, కాలూ, తెల్ల మెడ గాడు, ఎర్ర మూతి గాడు, ఇంగ్లీష్ బుల్ డాగ్ గాడు, బిస్కెట్ గాడు (ఇవన్నీ ఆమె పెట్టిన పేర్లు) ... వాళ్లతోనే నడిచి క్లియోతో ఆడుకునేవి. వాటికి కొన్ని బిస్కెట్లు పెట్టేవాళ్లు. కానీ, వాటికి తిండి సరిగా దొరుకుతుందా లేదా అని ఆలోచించలేదు. అలా బిస్కెట్లు పెట్టడాన్ని రోజూ క్లియో గమనించి, ఆమె చేతిని తన కాలితో తట్టి, కుయ్ కుయ్ అని ఏదో చెప్పేది. ఆటల్లో భాగమనుకుని ఆమె పెద్దగా పట్టించుకోలేదు. వచ్చేటపుడు మిగిలిన బిస్కెట్లన్నీ తన స్నేహితులకు పెట్టేసే దాకా క్లియో ఊరుకునేది కాదు.

ఒకరోజు క్లియో ఎవరూ ఊహించని పని చేసింది. దానికి అప్పుడు ఏడాది వయసుంటుది. పొద్దున్నే తిండి పెట్టమని దాని బౌల్ తెచ్చుకుని కూచుంది. మామూలుగా తొమ్మిదింటికి పెట్టేవాళ్లు.

అది అలా అడుగుతుంటే, "పాపం బిడ్డకి ఎంత ఆకలి వేసిందో" అని కడుపు నిండా పెట్టారు. మొత్తం తినేసాక వాకింగ్‌కి వెళ్ళారు. చిన్నూ, కాలూ పరిగెత్తుకుని వాళ్ల దగరికి వెళ్లారు. అప్పుడే ఊహకు అందని పని చేసింది క్లియో. వాటిని పక్కకు లాక్కెళ్ళి, ఒక సిమెంట్ గట్టు మీద, తను తిన్న ఆహారాన్ని మొత్తం కక్కేసి, వాటి ఎదురుగా కూచుని "భౌ భౌ" మని అరిచింది. అవి రెండూ వెంటనే దాన్ని తినేశాయి. వేరే చోట దొరికిన ఆహారాన్ని కుక్క తన పిల్లలకు ఇలాగే తెచ్చి పెడుతుంది, ఇదే పద్ధతి! ఆరోజు ఆ దృశ్యాన్ని చూసిన ఆమెకు చెమట్లు పోశాయి. "వాటికి ఆకలేస్తుంది. బిస్కెట్లు కాదు, కడుపు నిండా తిండి పెట్టు" అని క్లియో ఆమెకు స్పష్టంగా చెప్పింది. "తనలోని మనిషిని తట్టి లేపిన ఏంజెల్ క్లియో" అని ఆమె ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంది.

-జీవన డెస్క్

పాత సినిమాల్లో సమానత్వ భావన

దేశమంటే భిన్న జాతులు, మతముల సమ్మేళనం. దేశమంటే విభిన్న భాషల, సంస్కృతుల సంగమం. అంతకంటే ముందు దేశమంటే.. మనుషుల సందోహం. కలిసి మెలిసి బతకటం, కలిసి మెలిసి కదలటం మన స్వాతంత్ర్య పోరాటం మనకిచ్చిన వారసత్వం! కొంతమంది చరిత్రను వక్రీకరించి, మనుషుల మెదళ్లలో మతాల పేరిట విషం, విద్వేషం నింపుతున్నారు. అయినా కొందరు వాటిని పట్టించుకోకుండా సామరస్యాన్ని, సౌభ్రాతృత్వాన్ని ప్రదర్శిస్తుండటం అభినందనీయం. సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదు. అప్పుడప్పుడూ చరిత్రనూ చెబుతుంది. స్వాతంత్ర్య సమరయోధుల గాథల్ని వివరిస్తుంది. దేశభక్తిని రగిలిస్తుంది. సినీ పరిశ్రమ చాలా సంవత్సరాలుగా అనేక దేశభక్తి చిత్రాలను విడుదల చేసింది. చిత్ర నిర్మాతలు స్ఫూర్తిని పెంపొందించటానికి, దేశం పట్ల భారతీయులను గర్వించే భావాన్ని నింపడానికి తమవంతుగా ప్రయత్నించారు. దేశభక్తిని ప్రభోదించే సినిమాలు తీయటం ద్వారా కూడా దేశం పట్ల తమ ప్రేమను ప్రదర్శిస్తున్నారు.



తెలుగు చిత్రసీమలో అలనాటి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్‌బాబుల కాలం నుండి నేటి హీరోల వరకూ స్వాతంత్ర్యోద్యమ పోరాట విశిష్టతను, దేశభక్తిని, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను, వారి వీరత్వాన్ని వివరించే అజరామర దేశభక్తి గీతాలు చాలా ఉన్నాయి.

'పాడవోయి భారతీయుడా.. ఆడి పాడవోయి విజయ గీతికా' అంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన దేశభక్తి గీతాన్ని అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'వెలుగు నీడలు' చిత్రంకోసం పి.సుశీల, ఘంటసాల ఆలపించారు. నేటికీ దేశభక్తి గీతాల్లో తొలిస్థానం ఈ పాటకే దక్కుతుంది. ఎన్టీఆర్ నటించిన 'బడిపంతులు' చిత్రంలోని 'భారతమాతకు జేజేలు బంగారు భూమికి జేజేలు' అనే పాట ప్రతిచోటా ప్రతిధ్వనిస్తుంది. ఆచార్య ఆత్రేయ రచించిన ఈ దేశభక్తి గీతం ఘంటసాల గాత్రంలో వీనుల విందు చేస్తుంది.



'గాంధీ పుట్టిన దేశం' చిత్రంలోని 'గాంధీపుట్టిన దేశం రఘురాముడు ఏలిన రాజ్యం' అనే పాట మన దేశ విశిష్టతను గుర్తుచేస్తుంది. 'పుణ్యభూమి నాదేశం నమో నమామి'. ఎన్టీఆర్ నటించిన 'మేజర్ చంద్రకాంత్' చిత్రంలోని ఈ పాట దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో వీరుల త్యాగాలను గుర్తుచేస్తుంది. రాక్షసుడు సినిమాలో 'జయ జయ ప్రియ భారత జనయిత్రీ'...దేశాన్ని తల్లిగా కీర్తిస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన గీతం ఉర్రూతలూగిస్తుంది. 1936లో వచ్చిన 'ప్రేమవిజయం' సినిమాలోనూ అభ్యుదయం కనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చిన 'మాలపిల్ల', 'మళ్ళీ పెళ్లి', 'రైతుబిడ్డ', 'వందేమాతరం', 'సుమంగళి', 'దేవత' తదితర చిత్రాల్లో సమానత్వ భావాలు కనిపిస్తాయి. 'బొబ్బిలియుద్ధం', 'తాండ్ర పాపారాయుడు', 'సర్దార్ పాపారాయుడు', 'మేమూ మనుషులమే', 'నాడు–నేడు' తదితర చిత్రాలు కూడా స్వాతంత్ర్య పోరాట నేపథ్యంలో సాగినవే. ఇలాంటి దేశభక్తిని రగిలించే పాటలు ఎన్నో ఉన్నాయి. ప్రతి భారతీయుడి మదిలో నిలిచిపోయాయి.



'ఆగాకు... ఆచార్య దేవ ఏమంటివి ? ఏమంటివి?

జాతి నెపమున సూత సుతున కిందు నిలువ అర్హత

లేనందువా...ఎంతమాట. ఇది క్షాత్ర పరీక్షయే

కాని క్షత్రియ పరీక్ష కాదే! కాదు కాకూడదు ఇది కులపరీక్షయే

అందువా? నీ తండ్రి భరద్వాజుని జననమెట్టిది? అతి జుగుప్సాకరమైన నీ సంభవమెట్టిది?' అంటూ ఈ సుదీర్ఘ డైలాగ్ సుప్రసిద్ధ నటుడు ఎన్టీఆర్ నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన 'దానవీర శూరకర్ణ' సినిమాలోనిది. ఇది అందరికీ తెలిసిందే. ఐదు దశాబ్దాలు గడుస్తున్నా అప్పట్లో రికార్డులు బద్దలు కొట్టిన ఈ సినిమా నేటికీ ప్రజల నోళ్లలో మెదులుతూనే ఉంటుంది. అప్పట్లో కేవలం 43 రోజుల్లో ఈ సినిమా షూటింగ్‌ను పూర్తిచేసి ఎన్టీఆర్ రికార్డు నెలకొల్పారు. సినిమా నిడివి నాలుగు గంటలైనా ఎక్కడా బోరు కొట్టకుండా ఉండటం మరో ప్రత్యేకత. మహాభారత గాథలో కీలకమైన ఘట్టాలను గుదిగుచ్చి కృష్ణ, దుర్యోధన, కర్ణ పాత్రల్లో ఎన్టీఆర్ నటించారు. కులం, మతం, జాతుల బేధం వద్దంటూ కొండవీటి వేంకటకవి రాసిన డైలాగులు నేటికీ చాలామంది ఫోన్లకు రింగ్‌టోన్‌గానే కొనసాగుతున్నాయి. లవకుశ తర్వాత అంత ప్రజాదరణ పొందిన చిత్రంగా 'దానవీర శూర కర్ణ' సినిమా నిలిచింది. అప్పట్లో సంక్రాంతి కానుకగా వచ్చిన సూపర్ స్టార్ కృష్ణ 'కురుక్షేత్రం' సినిమాను బ్రేక్ చేసి రికార్డులు నెలకొల్పింది. గొప్ప ఫాంటసీ సినిమాగా పాతాళ భైరవి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. ఈ చిత్రం చరిత్రలో నిలిచిపోయింది. నాగిరెడ్డి–చక్రపాణిల అభిరుచి, కెవి రెడ్డి దర్శకత్వ పటిమ, సాంకేతికబృందం ప్రతిభ, వీటన్నింటికీ మించి ఎన్టీ రామారావు, ఎస్‌వి రంగారావుల అద్భుతమైన నటనా విన్యాసాలు మేళవించి తెలుగు ప్రేక్షకులకు కమ్మని విందుభోజనం రుచి చూపించింది. 1951, మార్చి 15న విడుదలైన ఈ సినిమాలో కథానాయకుడంటే 'ఎందుకొచ్చిన బతుకు' అనుకుంటూ ఉండేవాడిని, ధీరోదాత్త గుణం ఆపాదించిన మొదటి సినిమా ఇదే. ఓ సామాన్య మానవుడు రాకుమార్తెను ప్రేమించటం, విరహ వేదన భరించలేక దొంగచాటుగా కోటలో ప్రవేశించి రాకుమార్తెను దర్శించుకోవటం.. చివరల్లో మాంత్రికుడి బారి నుంచి ఆమెను రక్షించడం.. ఇవన్నీ సాహసాలే. మనం తరచూ వాడే 'గురూ' అనే పదాన్ని ఈ సినిమాలోనే పింగళి సృష్టించారు. 'మోసం గురో, ఏం గురో' అంటూ సదాజపుడు (పద్మనాభం) చేత పలికించిన మాటలు తెలుగు ప్రజల నోట తరచుగానే వింటుంటాం.

సమైక్యత, సౌభ్రాతృత్వం మనకు స్వాతంత్ర్యోద్యమం ఇచ్చిన వారసత్వం. పాలకులు తాము చేసే తప్పులు బయటపడకుండా ప్రజలను కుల, మత, ప్రాంతీయ ఉద్వేగాలు, ఉద్రేకాలు వైపు నడిపిస్తారు. విష బీజాలు నాటుతారు. ప్రజలు ఆ ప్రమాదాన్ని పసిగట్టాలి. సమైక్య, సామరస్యాలతో పరిమళించాలి.

మూడు రకాల మట్టితో 86 పిచ్‌లు

- అవుట్‌డోర్, ఇండోర్‌లో 45 ప్రాక్టీస్ పిచ్‌లు
- అధునాతన బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆవిష్కరణ
- 40 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆవిష్కరిస్తున్న బిసిసిఐ ఆఫీస్ బేరర్లు రోజర్ బిన్ని, జై షా, రాజీవ్ శుక్లా తదితరులు



బెంగళూర్ : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) 16 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. బెంగళూర్ శివారు ప్రాంతంలో 40 ఎకరాల సువిశాల క్యాంపస్‌లో బీసీసీఐ నేషనల్ క్రికెట్ అకాడమీని ఆదివారం ప్రారంభించింది. కొత్త ప్రాంగణంలో ఎన్‌సీఏ ఇక నుంచి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉండనుంది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్ని, కార్యదర్శి జై షా, ఆఫీస్ బేరర్లు రాజీవ్ శుక్లా తదితరులు ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. 2025 ప్రథమార్థం నుంచి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెటర్లకు అందుబాటులోకి రానుంది. ట్రైనింగ్, స్పోర్ట్స్ సైన్స్, రిహాబిలిటేషన్, ఇంజూరీ మేనేజ్‌మెంట్‌కు ఇక నుంచి బీసీఈ కేంద్రంగా పని చేయనుంది. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సిఏ)ని దశల వారీగా బీసీఈకి తరలించనున్నారు. బిసిసిఐ, కర్ణాటక క్రికెట్ సంఘం (కెఎస్‌సిఏ) అభ్యర్థన మేరకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం 2008లో 40 ఎకరాల భూమి కేటాయించింది. కానీ న్యాయపరమైన చిక్కులతో భూమి బీసీసీఐ చేతికి రాలేదు. 2020లో లీగల్ సమస్యలను అధిగమించి 2022 ఫిబ్రవరిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు భూమిపూజ చేశారు. చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలో 2000 నుంచి ఎన్‌సిఏ కొనసాగుతుంది. ఇటువంటి సదుపాయాలు ఇప్పటివరకు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాకు మాత్రమే ఉండేవి. తాజాగా ఆ జాబితాలోకి భారత్ సైతం చేరింది.

ముచ్చటగా మూడు గ్రౌండ్లు : ఐసిసి నిబంధనలకు అనుగుణంగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వగల మూడు గ్రౌండ్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రౌండ్‌కు అత్యాధునిక ఫ్లడ్‌లైట్లు, సబ్ ఎయిర్ డ్రైనేజీ వ్యవస్థ, ప్రసార సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ముంబయి నుంచి తెప్పించిన ఎర్ర మట్టితో 13 ఎర్ర మట్టి పిచ్‌లను తయారు చేశారు. ఇక నుంచి భారత్–ఏ జట్టు మ్యాచులను ఇక్కడే నిర్వహించనున్నారు. గ్రౌండ్ బి, సిలు ప్రాక్టీస్ మైదానాలుగా ఉంటాయి. ఈ రెండు గ్రౌండ్స్‌లో కర్ణాటకలోని మాండ్య, ఒడిశాలోని కల్హానండి నుంచి తెప్పించిన నల్ల మట్టితో పిచ్‌లు తయారు చేశారు.



జాతీయ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్

ప్రపంచ శ్రేణి ఇండోర్ సదుపాయం : సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రపంచ శ్రేణి ఇండోర్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఇండోర్ ట్రైనింగ్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా నుంచి తెప్పించిన మట్టితో పిచ్‌లు తయారు చేశారు. దేశవ్యాప్తంగా తెప్పించిన మూడు రకాల మట్టితో 45 ప్రాక్టీస్ పిచ్‌లను సిద్ధం చేవారు. స్పోర్ట్స్ సైన్స్, మెడిసిన్ బ్లాక్ సహా బస చేసేందుకు క్యాంపస్‌లో ప్రత్యేకంగా నిర్మాణాలు చేపట్టారు. ఇండోర్, అవుట్‌డోర్ అథ్లెటిక్స్ ట్రాక్ సహా స్విమ్మింగ్‌పూల్, రికవరీ సౌకర్యాలు ఇందులో భాగంగా ఉన్నాయి. క్రికెటేతర అథ్లెట్లకు సైతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇండోర్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. 40 ఎకరాల క్యాంపస్‌లో భవిష్యత్ ప్రణాళికల కోసం ఏడు ఎకరాలను ఖాళీగా ఉంచారు.

నైపుణ్య కేంద్రం : ఎన్‌సిఏ అనగానే అందరూ రిహాబిలిటేషన్ సెంటర్ అనుకుంటారు. గాయం నుంచి కోలుకునేందుకు మాత్రమే క్రికెటర్లు ఇక్కడకు వస్తారని భావిస్తారు. కానీ క్రికెటర్లు తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు, స్కిల్స్‌ను మెరుగుపర్చుకునేందుకు ఎక్కువగా ఎన్‌సీఏలో అడుగుపెడతారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రాకతో ఇక నుంచి మరిన్ని శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆస్కారం ఉంటుంది. అండర్–15 బాలికలు, అండర్–15 బాయ్స్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారిని ఎంపిక చేసి ఇక్కడ శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు ఉన్నాయి. ఇప్పటివరకు ఎన్‌సీఏ నిర్వహించిన 32 క్యాంప్‌లు దేశవ్యాప్తంగా భిన్న వేదికల్లో జరిగాయి. ఇక నుంచి క్యాంప్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే నిర్వహిస్తాం. భారత–ఏ జట్ల మ్యాచులకు సైతం ఈ గ్రౌండ్‌ను వినియోగిస్తామని ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ తెలిపారు.

ఏ పరిస్థితుల్లోనైనా రాణించేలా : సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతిముఖ్యమైన అంశం.. మూడు రకాల మట్టితో తయారు చేసిన పిచ్‌లు. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే క్రికెటర్లు భిన్న పరిస్థితులకు అలవాటు పడేందుకు.. ఎన్నో ప్రదేశాలకు ప్రయాణం చేసి సాధన చేయాల్సి వచ్చేది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా వాడుతున్న మట్టి, పిచ్‌లను అధ్యయనం చేసి ఇక్కడ తయారు చేశారు. ఇక్కడ సాధన చేసి క్రికెటర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవచ్చు. వర్ధమాన క్రికెటర్లకు మాత్రమే కాదు ప్రస్తుత క్రికెటర్లకు సైతం ఇది ఒక వరమని చెప్పవచ్చు. ప్రపంచంలో నేను ఎన్నో అకాడమీలు చూశాను. అందులో ఇతర క్రీడలకు సంబంధించిన అకాడమీలు సైతం ఉన్నాయి. కానీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తరహా స్పోర్ట్స్ అకాడమీని ఎక్కడా చూడలేదని లక్ష్మణ్ అన్నారు.



స్వర్ణ పతకం సాధించిన భారత్ బృందం

వరల్డ్ జూనియర్ షూటింగ్ పోటీల్లో భారతకు స్వర్ణం

ప్రజాశక్తి- గుంటూరు లీగల్

పెరూ దేశ రాజధాని లిమాలో జరుగుతున్న వరల్డ్ జూనియర్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో పది మీటర్ల ఎయిర్ పిస్టల్ టీం విభాగంలో నేలవల్లి ముఖేష్, ప్రమోద్, ఉమేష్‌చౌదరితో కూడిన భారత జట్టు స్వర్ణపతకం సాధించింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ పోటీల్లో జట్టు విజయంలో గుంటూరు శ్రీనగర్‌కు చెందిన నేలవల్లి ముఖేష్ ముఖ్యపాత్ర పోషించాడు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంతోపాటు 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, రాపిడ్ ఫైర్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, 50 మీటర్ల ఫ్రీ పిస్టల్ విభాగాల్లోనూ ముఖేష్ మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్టోబర్ ఐదో తేదీ వరకూ ఈ పోటీలు జరగనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68